www.prajanaava.in

Telugu Daily

ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

Published from: **Hyderabad, Rangareddy, Karimnagar** Circulated to: **Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 57 | శనివారం | 3 అక్టోబర్, 2026

ఏపీలో రిలయన్స్ రూ.లక్ష కోట్ల పెట్టుబడి

- సీబీజీ ప్లాంట్లతో 3 లక్షలకు పైగా ఉద్యోగాలు
- రాష్ట్రానికి రూ.60 వేల కోట్ల ఆదాయం



7



సూపర్ సిక్స్

- ఆసియా క్రీడల్లో ఒకేరోజు భారత్‌కు ఆరు స్వర్ణాలు
- మహిళల హాకీలో 44ఏళ్ల తర్వాత స్వర్ణం
- బాక్సింగ్‌లో హ్యాట్రిక్.. ఆర్చరీ, రెజ్లింగ్‌లోనూ పసిడి పతకాలు
- ఆర్చరీలో పురుషుల రికర్వ్ జట్టు, మిక్స్‌డ్ జట్టుకు రజతాలు
- సెయిలింగ్‌లో కాంస్యం

7

ఆసియా క్రీడల్లో భారత క్రీడాకారులు శుక్రవారం అదరగొట్టారు. హాకీలో మహిళల జట్టు 44ఏళ్ల తర్వాత స్వర్ణం సాధించగా, బాక్సింగ్‌లో లవ్లీనా బోర్గోహె న్, వర్వీన్ హూడా, అంకుశ్ పంఘాల్ పసిడి పతకాలు అందు కున్నారు. రెజ్లింగ్‌లో సుజీత్ కల్కల్, మహిళల రికర్వ్ ఆర్చరీ జట్టు సైతం స్వర్ణ పతకాలు గెలుచుకున్నాయి. ఆర్చరీలో పురుషుల రికర్వ్ జట్టు, మిక్స్‌డ్ జట్టు రజతాలు సాధించగా, సెయిలింగ్‌లో నెత్రా కుమనన్ కాంస్యం గెలుచుకుంది. దీంతో శుక్రవారం ఒకేరోజు భారత్ ఖాతాలో 9 పతకాలు చేరుకోగా.. ఇందులో 6 స్వర్ణాలు, 2 రజతాలు, 1 కాంస్యం ఉన్నాయి.

డెంగీ పంజా!

రాష్ట్రవ్యాప్తంగా విష జ్వరాలతో జనం విలవిల

- పెరుగుతున్న కేసులు.. ఇద్దరి మృతి
- సెప్టెంబర్‌లో ఒక్కసారిగా విజృంభించిన మహమ్మారి
- ఫీవర్ ఆసుపత్రిలో రోజుకు 600 దాటుతున్న ఓపీ
- గాంధీలో 20శాతం జ్వర బాధితులే

ఫైల్ ఫొటో



ప్రజానావ, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా డెంగీ కేసులు వేగం గా పెరుగుతున్నాయి. హైదరాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలతో పాటు భద్రాద్రి కొత్తగూడెం, ములుగు తదితర ఏజెన్సీ ప్రాంతాల్లోనూ పెద్ద సంఖ్యలో కేసులు నమోద వుతున్నాయి. డెంగీ కారణంగా ఇప్పటికే ఇద్దరు మృతి చెంద డంతో ఆందోళన నెలకొంది. వైరల్ జ్వరాల తీవ్రత కూడా పెరుగుతుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జ్వరం వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించి తగిన చికిత్స తీసుకో వాలని వైద్యులు సూచిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభంలో అధికారులు చేపట్టిన జ్వర సర్వేలో ఇప్పటివరకు ఐదు లక్షల మందికిపైగా జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించారు. వీరిలో సుమారు 3వేల డెంగీ కేసులు వెలుగు చూశాయి. మరోవైపు సుమారు 5వే టైఫాయిడ్ కేసులు నమోదయ్యాయి. అయితే టైఫాయిడ్ కారణంగా ఎలాంటి మరణాలు సంభవించకపోవ డం కొంత ఊరటనిస్తోంది. తక్కువ సంఖ్యలో మలేరియా కేసు లు కూడా నమోదైనట్లు అధికారులు తరువాయి 2లో..

- విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్..

రాష్ట్రవ్యాప్తంగా సెంట్రల్ కిచెన్లు

డిసెంబర్ 9నుంచి ప్రభుత్వ స్కూళ్లలో అమలు

- సరికొత్త కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం
- కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు సంస్థల సాయం
- నిత్యం 25 లక్షల మందికి పౌష్టికాహార టిఫిన్
- పలు సంస్థలతో సీఎం సమక్షంలో ఒప్పందం



ప్రజానావ, హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని విస్తరించనుంది. డిసెంబర్ 9వ తేదీన అన్ని జిల్లాల్లో సెంట్రల్ కిచెన్స్ సేవలను ప్రారంభిం చనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ బృ హత్తర కార్యక్రమం ద్వారా ప్రతిరోజూ 25 లక్షల మందికి పైగా విద్యార్థులకు ఉదయం వేళ బలవర్ధకమైన, పరిశుభ్రమైన అల్పా హారం లభిస్తుంది. నవంబర్ 30 నాటికి వంటశాలల నిర్మాణ పనులన్నీ పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. ఆహార నాణ్యత, పంపిణీ ప్రక్రియను పర్యవే క్షించేందుకు ఈ కిచెన్లను హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ క మాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానిస్తారు. పిల్లలకు అం దించే ఆహారంలో ఉండే క్యాలరీల స్థాయిని ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా రోజువారీగా ట్రాక్ చేస్తారు. స్థానిక ఆహారపు అలవాట్లను గౌరవిస్తూనే సంపూర్ణ పోషకాలతో కూడిన మెనూ ను ఖరారు చేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉద యం అల్పాహారం అందించే బృహత్తర ప్రాజెక్టు కోసం ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో తరువాయి 2లో..



గాంధీ ఆశయాలే ప్రజా పాలనకు మార్గదర్శకం

- సత్యం, అహింస, సామాజిక సమానత్వంతో తెలంగాణను ముందుకు తీసుకెళ్తాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

2



కల్యాణలక్ష్మిని కాలరాసే కుట్రలు

2

- 12ఏళ్లలో 16.78 లక్షల పేద కుటుంబాలకు రూ.16,375 కోట్ల సాయం
- కాంగ్రెస్ తులం బంగారం ఇవ్వడం కాదు.. పథకాన్నే ఎత్తేసే యత్నం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

రాష్ట్రంలో భారీగా పెరిగిన ఆటో ఛార్జీలు

2

- కిలోమీటర్‌కు రూ.15 చొప్పున పెంపు
- తొలి 1.6 కి.మీ.కు కనీస ఛార్జీ రూ.30
- పెంచిన ధరలు నేటి నుంచే అమల్లోకి
- లగేజీపైనా అదనపు చార్జీలకు అనుమతి
- జీవో జారీ చేసిన ప్రభుత్వం



సీఈసీ తప్పుకోవాల్సిందే


- ముంబై శివాజీ పార్క్‌లో భారీ నిరసన
- సర్ ప్రక్రియలో పారదర్శకత ఉండాలి
- జాబితాను మార్చకుండా నిలిపివేయాలి
- కాక్రోచ్ జనతా పార్టీ కీలక డిమాండ్
- సీజేపీకి వ్యతిరేకంగా 'జెన్ నెక్ట్స్ ' ఆందోళన
- భారీగా మోహరించిన భద్రతా బలగాలు

2

మహారాష్ట్ర రాజధాని ముంబైలో శుక్రవారం కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన జరిగింది. సర్ ప్రక్రియలో అక్రమాలు, అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్న సీజేపీ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తోంది. ఈ క్రమంలోనే అభిజిత్ దీప్కే నేతృత్వంలోని సీజేపీ పిలుపు మేరకు ముంబై శివాజీ పార్క్‌లో నిరసనకు వేలాది మంది యువకులు, విద్యార్థులు, పౌర సమాజ ప్రతినిధులు తరలివచ్చారు. మరోవైపు ఆ పార్టీకి వ్యతిరేకంగా 'జెన్ నెక్ట్స్ ముంబై' బృందం కౌంటర్ ప్రదర్శన నిర్వహించింది. ఈ పోటాపోటీ ఆందోళనల కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

ప్రయాణికుల ప్రాణాలు కాపాడిన పైలట్‌కు మోదీ ప్రశంసలు

- కో పైలట్ దాడి చేసినా విమానాన్ని రక్షించిన స్మిత్ మచ్చార్‌తో ఫోన్‌లో సంభాషణ
- గాంధీ జయంతి రోజున అహింసకు నిజమైన అర్థం చూపించారంటూ అభినందించిన ప్రధాని



న్యూఢిల్లీ: దుబాయ్ నుంచి టెల్‌అవీవ్‌కు వెళ్తు న్న ఫ్లై దుబాయ్ విమానాన్ని ప్రమాదం నుంచి కాపాడిన కెప్టెన్ స్మిత్ మచ్చార్ ధైర్య సాహ సాలను ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. యూఏఈలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతు న్న మచ్చార్‌తో శుక్రవారం వీడియో కాల్‌లో మాట్లాడారు. భారతీయులు ప్రాణాలు తీసేవా రు కాదు.. ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు తమ ప్రాణాలను పణంగా పెడతారు. మీరు 140 కోట్ల మంది భారతీయుల గౌరవాన్ని ఇనుమడింపజేశారు అని మోదీ అన్నారు. తీ వ్రంగా గాయపడినా సమయస్ఫూర్తి, ధైర్యం, సంయమనంతో వ్యవహరించి వందలాది ప్రా ణాలను కాపాడారని కొనియాడారు. విమానా లు నడిపిన 17 ఏళ్ల అనుభవం తనకు ఉందని, 11ఏళ్లు కెప్టెన్‌గా పనిచేశానని మచ్చార్ తెలిపా రు. కో–పైలట్‌తో జరిగిన పెనుగులాటలో తీ వ్రంగా గాయపడినా.. ప్రయాణికుల ప్రాణా లను కాపాడేందుకు కాక్‌పిట్‌లో నేలపై పడి ఉ న్నప్పటికీ మిగిలిన శక్తితో విమానాన్ని నియం త్రించానని వివరించాడు. కష్టాల్లో ఉన్నప్పుడు హనుమాన్ చాలీసా పఠిస్తానని మచ్చార్ చెప్ప గా, 'దేశానికి దూరంగా ఉన్నాను కానీ మన సంస్కృతికి కాదు' తరువాయి 2లో..

రాష్ట్రంలో భారీగా పెరిగిన ఆటో ఛార్జీలు

- కిలోమీటర్‌కు రూ.15 చొప్పున పెంపు



ప్రజానావ, హైదరాబాద్: ఆటో డ్రైవర్లకు తెలంగాణ ప్రభుత్వ ఊరట కల్పించింది. ఆటో ఛార్జీలను ప్రభుత్వం పెంచింది. ఈ మేరకు శుక్రవారం రేవంత్ సర్కార్ అధికారికంగా ఒక జీవో కూడా జారీ చేసింది. ఆటోల కనీస చార్జీని రూ. 20 నుంచి రూ.30కి పెంచుతున్నట్లు జీవోలో పొందుపర్చింది. ప్రతీ కిలోమీటర్‌కు రూ.11 నుంచి రూ.14కి పెంచుతున్నట్లు ప్రకటించింది. ఇక టిటెన్నన్ చార్జి 50 పైసల నుంచి 75 పైసలకు పెంచగా.. లగేజీ ఛార్జీ 25 పైసల నుంచి 50 పైసలకు పెంచారు. ఇక గరిష్ట లగేజీ పరిమితి 100 కిలోలుగా కొనసాగించారు. ఇక రాత్రి సమయాల్లో ఛార్జీల పై 1.5 రెట్లు కొనసాగించారు. దాదాపు 12 ఏళ్ల తర్వాత ఆటో ఛార్జీలను ప్రభుత్వం సవరించింది.కొత్త ఆటో ఛార్జీల అమలు కోసం మీటర్ల రీసెట్టింగ్‌కు ప్రభుత్వం 3 నెలల గడువు విధించింది. రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు ఒకటిన్నర శాతం అదనపు ఛార్జీలు వసూలు చేసుకునేలా వెసులుబాటు కల్పించింది. మూడు నెలల్లోగా ఆటో డ్రైవర్లు డిజిటల్ మీటర్లను ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఆటో ఛార్జీలను అధికారికంగా ధృవీకరిస్తూ జీవో 46 జారీ చేసింది. ఈ చార్జీలు తక్షణమే అమల్లో వస్తాయని వెల్లడించింది. ఇక ట్రాఫిక్ లేదా ఇతర కారణాల వల్ల ఆటో ఆగినప్పుడు నిమిషానికి 75 పైసలు చొప్పున వెయిటింగ్ ఛార్జీ ఖరారు చేశారు. రాత్రి సమయాల్లో ప్రయాణించేవారు సాధారణ ఛార్జీల కంటే అదనంగా 50 శాతం చెల్లించాల్సి ఉంటుంది. ఇక ప్రయాణికులు ఆటోలో తమ వెంట హ్యాండ్ బ్యాగ్, బ్రీఫ్ కేస్ వంటికి ఉచితంగా తీసుకెళ్లవచ్చు. ఇతర పెద్ద లగేజీలు తీసుకెళ్లాలంటే కిలోమీటర్‌కు 50 పైసలు చొప్పున అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఆటోలో తొలి 1.6 కిలోమీటర్లకు కనీస ఛార్జీ రూ.30గా ఫిక్స్ చేశారు. ఆ తర్వాత ప్రతీ అదనపు కిలోమీటర్‌కు రూ. 15 చొప్పున ఖరారు చేశారు. ఇక కొత్త ధరలపై ఆటోల్లో ఫేర్ కార్డులను ఏర్పాటు చేయాలని డ్రైవర్లను ప్రభుత్వం ఆదేశించింది. కాగా ఆటో ఛార్జీలను పెంచాలని డ్రైవర్ల సంఘాలు ఇటీవల సమ్మెకు పిలుపునిచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా ఆటోలను నిలిపివేసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. దీంతో ప్రభుత్వం దిగొచ్చి ఆటో సంఘాలతో చర్చలు జరిపి సానుకూల నిర్ణయం తీసుకోవడంతో సమ్మెపై వెనక్కి తగ్గారు. ఈ క్రమంలో ఆటో డ్రైవర్లకు ఊరట కల్పిస్తూ ఛార్జీలను ప్రభుత్వం పెంచింది. అలాగే డ్రైవర్ల సంక్షేమ కోసం ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసే పనిలో ప్రభుత్వం ఉంది. అయితే ఛార్జీల పెంపు వల్ల డ్రైవర్లకు ప్రయోజనం చేకూరనుండగా.. సామాన్యులకు భారమనే చెప్పుకోవచ్చు.

కల్యాణలక్ష్మి ని కాలరాసే కుట్రలు

- 12ఏళ్లలో 16.78 లక్షల పేద కుటుంబాలకు రూ.16,375 కోట్ల సాయం
- కాంగ్రెస్ తులం బంగారం ఇవ్వడం కాదు.. పథకాన్నే ఎత్తేసే యత్నం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



ప్రజానావ, హైదరాబాద్: పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు 12ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. కూతురి పెళ్లి కోసం తల్లిదండ్రులు అప్పులపాలయ్యే పరిస్థితిని మార్చేందుకు ఈ పథకాలను తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు. పథకం వార్షికోత్సవం సందర్భంగా లబ్ధిదారులకు శుభాకాంక్షలు చెప్పారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఓ గిరిజన తండాలో తన కుమార్తె వివాహం కోసం ఓ కుటుంబం పడిన కష్టాలను కేసీఆర్ స్వయంగా చూసిన ఘటన కల్యాణలక్ష్మి పథకానికి ప్రేరణగా నిలిచిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఉద్యమ సమయంలో బానోతు కీమా నాయక్ తన కుమార్తె పెళ్లి కోసం దాచుకున్న డబ్బును కోల్పోయిన పరిస్థితిని చూసి కేసీఆర్ చలించిపోయారని, ఆ కుటుంబానికి సాయం చేశారని తెలిపారు. అదే తరహాలో రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబంలోని ఆడబిడ్డ వివాహానికి అండగా ఉండాలనే ఉద్దేశంతో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలను అమల్లోకి తెచ్చారని వివరించారు. పేదింటి ఆడబిడ్డ పెళ్లికి రూ.1,00,116 ఆర్థిక సాయం అందించాలనే ఆలోచన కేసీఆర్‌దేనని కేటీఆర్ అన్నారు. ఈ పథకాలతో వివాహ సమయంలో తల్లిదండ్రులపై ఆర్థిక భారం కొంతమేర తగ్గిందని, బాల్య వివాహాల నియంత్రణకు కూడా దోహదపడిందని పేర్కొన్నారు.

తల్లిదండ్రులకు భారం కావొద్దనే..

గత 12 ఏళ్లలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా 16.78 లక్షల పేద కుటుంబాలు లబ్ధి పొందాయని కేటీఆర్ వెల్లడించారు. వారికి రూ.16,375 కోట్లకు పైగా ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. కూతురి పెళ్లి తల్లిదండ్రులకు అప్పుల భారంగా మారకూడదనే లక్ష్యంతో ఈ పథకాలు కొనసాగాయని పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కల్యాణలక్ష్మి పథకాన్ని నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని కేటీఆర్ ఆరోపించారు. పథకంతో పాటు ఇస్తామని ప్రకటించిన తులం బంగారం సంగతి అటుంచితే, అసలు కల్యాణలక్ష్మి పథకాన్నే లేకుండా చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు.

గాంధీ ఆశయాలే ప్రజా పాలనకు మార్గదర్శకం

- సత్యం, అహింస, సామాజిక సమానత్వంతో తెలంగాణను ముందుకు తీసుకెళ్తాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజానావ, హైదరాబాద్: మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్ లంగర్‌హౌస్‌లోని బాపూఘాట్‌లో గాంధీజీ సమాధికి గవర్నర్ శివప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ చేసిన సేవలను స్మరించుకున్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు కూడా బాపూజీకి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. అహింసను ఆయుధంగా మలచుకుని స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించిన మహాత్మాగాంధీ ప్రపంచానికి సత్యం, శాంతి, మానవత్వం విలువలను చాటిన మహనీయుడని అన్నారు. సత్యం, అహింస, స్వావలంబన, గ్రామ స్వరాజ్యం, సామాజిక సమానత్వం గాంధీజీ ఆశయాలకు పునాదులని పేర్కొన్నారు. తెలంగాణలో ప్రజా పాలనకు కూడా ఈ ఆశయాలే మార్గదర్శకాలని చెప్పారు. గాంధీజీ చూపిన సత్యం, అహింస మార్గంలో శాంతి, సామాజిక న్యాయం, సమానత్వం, అభివృద్ధి దిశగా తెలంగాణను ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం తెలిపారు. గాంధీజీ ఆశయాలను ఆచరించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. అనంతరం బాపూఘాట్‌లో ఏర్పాటు చేసిన గాంధీజీ చిత్ర ప్రదర్శనను గవర్నర్, సీఎం తిలకించారు. గవర్నర్‌తో కలిసి డిజిటల్ మ్యూజియాన్ని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సర్వమత ప్రార్థనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ పాల్గొన్నారు.

ఎల్బీ స్టేడియంలో 1,157 చరకాలు

గాంధీ జయంతి సందర్భంగా గాంధీ జ్ఞాన ప్రతిష్ఠ సంస్థ ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా 1,157 చరకాలను ప్రదర్శించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్, వివేక్ వెంకటస్వామి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కార్యక్రమానికి హాజరయ్యారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను వారు పరిశీలించారు.

బల్లార్షా–గూడూరు మధ్య నాలుగో రైల్వే లైన్

- గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్ర రైల్వే శాఖ

ప్రజానావ, హైదరాబాద్: బల్లార్షా–కాజీపేట–విజయవాడ–గూడూరు మధ్య నాలుగో రైల్వే లైన్ నిర్మాణ పనులు వేగం పుంజుకోనున్నాయి. ఈ ముఖ్యమైన ప్రాజెక్టుకు కేంద్ర రైల్వే శాఖ గురువారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. 744.80 కిలోమీటర్ల పొడవైన ఈ లైన్‌తో పాటు ఇందుపల్లి–దుగ్గిరాల మధ్య 36.80 కిలోమీటర్ల డబుల్ లైన్ పనులకు కూడా అధికారిక ఆమోదం లభించింది. ఈ నోటిఫికేషన్‌తో భూసేకరణ ప్రక్రియకు కీలక అడుగు పడింది. ఈ ప్రాజెక్టు దక్షిణ మధ్య రైల్వే పరిధిలో చేపట్టబడుతోంది. మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా నుంచి తెలంగాణలోని కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్, హన్మకొండ, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల వరకు ఈ మార్గం విస్తరించి ఉంది. దేశంలో అత్యంత రద్దీగా ఉండే చెన్నై–న్యూఢిల్లీ రూట్‌లో భాగమైన ఈ లైన్ ప్రయాణికులు, సరుకు రవాణా రైళ్లకు పెద్ద ఉపశమనం కలిగిస్తుంది.

మెట్రో, ఆర్టీసీ కామన్ పాస్

- అధికారికంగా ప్రారంభించిన ప్రభుత్వం

ప్రజానావ, హైదరాబాద్: హైదరాబాద్ మహానగర పరిధిలోని ప్రయాణీకుల రవాణా అవసరాలను సులభతరం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లో ప్రయాణించే పౌరుల కోసం హైదరాబాద్ మెట్రో, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ) సంయుక్తంగా రూపొందించిన ఒకే ఉమ్మడి పాస్‌ను ప్రభుత్వం అధికారికంగా ప్రారంభించింది. ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఉన్నతాధికారుల సమక్షంలో ఈ నూతన కామన్ పాస్‌ను ఆవిష్కరించారు. ఈ కామన్ పాస్ ఆవిష్కరణ వెనుక ప్రధాన లక్ష్యం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నిరాటంకమైన, సులభతరమైన, సమగ్ర ప్రజారవాణా అనుసంధానాన్ని కల్పించడమే. నిత్యం లక్షలాది మంది ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు నగరంలో ప్రయాణాల కోసం బస్సులు, మెట్రో రైళ్లపై ఆధారపడుతుంటారు. ఇప్పటివరకు వేర్వేరుగా టికెట్లు లేదా పాస్‌లు తీసుకోవాల్సి రావడం వల్ల సమయం వృథా అవ్వడంతో పాటు ఇబ్బందులు ఎదురవుతుండేవి. ఈ కొత్త విధానం ద్వారా ప్రయాణీకులు ఒక్క కార్డుతోనే రెండు రవాణా వ్యవస్థల సేవలను వినియోగించుకోవచ్చు. ప్రయాణికుల సౌకర్యం కోసం ప్రభుత్వం ఈ కామన్ పాస్‌లలో రోజువారీ, నెలవారీ ప్యాకేజీలను అందుబాటులోకి తీసుకొచ్చింది. రోజువారీ ఉమ్మడి పాస్ ధరను రూ.400గా నిర్ణయించారు. ఇందులో మెట్రో ప్రయాణ ఛార్జీ కింద రూ.300, ఆర్టీసీ ప్రయాణ ఛార్జీ కింద రూ.100 వేర్వేరుగా లెక్కించబడతాయి. అలాగే రోజూ ప్రయాణించే వారి కోసం నెలవారీ ఉమ్మడి పాస్‌ను రూ.8,500లకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ నెలవారీ పాస్‌లో మెట్రో వాటా రూ.7,000 కాగా.. ఆర్టీసీ వాటా రూ.1,500గా లెక్కించబడతాయి. ఈ కామన్ పాస్ వినియోగం లిమిట్స్ విషయానికి వస్తేయ.. ఔటర్ రింగ్ రోడ్ పరిధి లోపల నడిచే అన్ని రకాల ఆర్టీసీ సిటీ బస్సులతో పాటు మెట్రో రైళ్లన్నింటిలోనూ ప్రయాణించడానికి ఇది వర్తిస్తుంది. సిటీ సాధారణ, ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, మెట్రో డీలక్స్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. అయితే శంషాబాద్ విమానాశ్రయానికి నడిచే ప్రత్యేక ఏసీ బస్సులు అయిన 'పుష్పక' సర్వీసులకు మాత్రం ఈ పాస్ వర్తిందని అధికారులు స్పష్టం చేశారు.



న్యూఢిల్లీ: మహారాష్ట్ర రాజధాని ముంబైలో శుక్రవారం కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన జరిగింది. సర్ ప్రక్రియలో అక్రమాలు, అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్న సీజేపీ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తోంది. ఈ క్రమంలోనే అభిజిత్ దీప్కే నేతృత్వంలోని సీజేపీ పిలుపు మేరకు ముంబై శివాజీ పార్క్‌లో నిరసనకు వేలాది మంది యువకులు, విద్యార్థులు, పౌర సమాజ ప్రతినిధులు తరలివచ్చారు. ఈ ఆందోళనలో గాంధీ కుటుంబానికి చెందిన తుషార్ గాంధీ, ప్రముఖ బాలీవుడ్ నటులు షబానా అజ్మీ, నసీరుద్దీన్ షా, సంగీత దర్శకుడు విశాల్ దద్లానీ కూడా పాల్గొని మద్దతు తెలిపారు. రాజకీయ పార్టీలు శివసేన , మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన పార్టీలు కూడా నిరసనకు తమ మద్దతు ప్రకటించాయి. నిరసనకారుల్ని ఉద్దేశించి ప్రసంగించిన సీజేపీ నాయకుడు అభిజిత్ దీప్కే, నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అసమర్థంగా ఉందని విమర్శించారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై జంతర్ మంతర్ వద్ద ఆందోళనలు జరిగిన 2 నెలల వ్యవధిలోనే మరోసారి తాము నిరసన చేపట్టాల్సి వచ్చిందని అన్నారు. మరోవైపు సీఈసీ తప్పక రాజీనామా చేయాల్సిందేనని, నేర విచారణ ఎదుర్కోవాల్సిందేనని దాదర్‌లో జరిగిన నిరసనలో సీజేపీ నాయకుడు అజింక్యా శిందే డిమాండ్ చేశారు.

సీఈసీ తప్పుకోవాల్సిందే

పెద్దసంఖ్యలో తరలివచ్చిన యువత

అంతకుముందు అక్టోబర్ 2న శివాజీ పార్క్‌లో మధ్యాహ్నం 4 గంటలకు నిరసన చేపడతామని సీజేపీ ముందుగానే హెచ్చరించింది. పోలీసుల నుంచి అనుమతి లభించకపోయినప్పటికీ నిరసన కార్యక్రమానికి పెద్దసంఖ్యలో యువత తరలివచ్చింది. నిరసన నేపథ్యంలో శివాజీ పార్క్ పరిసరాల్లో భారీగా పోలీసులు, భద్రతా సిబ్బందిని మోహరించారు. సమీపంలోని దాదర్ రైల్వే స్టేషన్ నుంచి వచ్చే మార్గాల్లో బారికేడ్లను ఏర్పాటు చేశారు. అయినప్పటికీ పెద్దసంఖ్యలోనే యువత శివాజీ పార్క్ వద్ద నిరసన ప్రాంతానికి చేరుకుంది. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కోరుతూ త్రివర్ణ పతాకాలతో పాటు వివిధ ప్లకార్డులను ప్రదర్శించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో పారదర్శకత ఉండాలని సీజేపీ డిమాండ్ చేస్తోంది. 2025 ఓటర్ల జాబితాను మార్చకుండా నిలిపివేయాలని కోరుతోంది. సీజేపీ చేపట్టిన నిరసనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ స్పందించారు. ఎన్నికల సంఘం కమిషనర్లు ఇప్పటికే అన్ని అనుమానాలకు వివరణ ఇచ్చారని, ప్రతిపక్షాలు నకిలీ కథనాలు వ్యాప్తి చేస్తున్నాయని, దీనిని ప్రజలు నమ్మరని వ్యాఖ్యానించారు. మరోవైపు ముంబైలో శుక్రవారం ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఓవైపు నిరసనలు చేపట్టగా, మరోవైపు ఆ పార్టీకి వ్యతిరేకంగా 'జెన్ నెక్స్ట్ ముంబై' బృందం కౌంటర్ ప్రదర్శన నిర్వహించింది. ఈ పోటాపోటీ ఆందోళనల కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద, ముంబైలోని శివాజీ పార్క్ పరిసర ప్రాంతాల్లో ఆందోళనలు జరిగాయి. తమ నిరసనకు ప్రజలు మద్దతు ప్రకటించాలని పార్టీ ప్రతినిధి సౌరవ్ దాస్ విజ్ఞప్తి చేశారు. వీరికి ప్రతిగా జెన్ నెక్స్ట్ ముంబై సభ్యులు అంబేద్కర్ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఒక నిరసనకారుడు మాట్లాడుతూ, "అభిజీత్ దీప్కే వంటి వ్యక్తులు రాజ్యాంగాన్ని అస్థిరపరచాలని చూస్తున్నారు. కానీ రాజ్యాంగాన్ని ఎలా కాపాడుకోవాలో, ఎలా గౌరవించాలో మాకు తెలుసు. అందుకే మేం బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్నాం. కాక్రోచ్ జనతా పార్టీ వైఖరిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోం" అని స్పష్టం చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా సెంట్రల్ కిచెన్లు

(మొదటిపేజీ తరువాయి)

హరేకృష్ణ మూవ్‌మెంట్ ఫౌండేషన్‌తో జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థలు అధికారిక ఒప్పందం కుదుర్చుకున్నాయి. నాగర్‌కర్నూల్ సెంట్రలైజ్డ్ కిచెన్ నిర్మాణం కోసం జున్నా సోలార్ సీఎండీ శేఖర్ రెడ్డి, సీఈఓ అనిల్ బాబు రూ. 5.17 కోట్ల చెక్కును అందించారు. వికారాబాద్ వంటశాల కోసం చైన్ ల్యాబ్స్ ఇండియా ప్రతినిధి డి. సుమంత్, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్ కుమార్ రూ. 4 కోట్ల విరాళం చెక్కును సీఎం చేతుల మీదుగా ఫౌండేషన్ ప్రతినిధి సత్య గౌర చంద్రదాస్ స్వామీజీకి అందజేశారు. ఈ పథకం ద్వారా విద్యార్థుల శారీరక ఎదుగుదల, చదువులో ప్రగతిని నిరంతరం పరిశీలించడానికి డిజిటల్ హెల్త్ రికార్డులను నిర్వహిస్తారు. పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపాన్ని అరికట్టి పాఠశాలల్లో హాజరు శాతాన్ని గణనీయంగా పెంచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. పరిశుభ్రమైన వాతావరణంలో వేడివేడిగా సిద్ధమయ్యే అల్పాహారాన్ని ప్రత్యేక వాహనాల్లో నేరుగా బడులకు తరలిస్తారు. ఈ మహత్తర కార్యక్రమానికి స్వచ్ఛంద సంస్థలు కూడా పెద్దపీట వేస్తున్నాయి. హరేకృష్ణ మూవ్‌మెంట్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో వంటశాలల నిర్మాణం వేగంగా సాగుతోంది. ఇందులో భాగంగా నాగర్‌కర్నూల్ సెంట్రల్ కిచెన్ కోసం రూ. 5.17 కోట్లు, వికారాబాద్ యూనిట్ కోసం రూ. 4 కోట్లు విరాళంగా అందించేందుకు ఆ సంస్థ ముందుకొచ్చింది.

..పైలట్‌కు మోదీ ప్రశంసలు

(మొదటిపేజీ తరువాయి)

అని అన్నారు. దేశవ్యాప్తంగా తన కోసం ప్రార్థనలు జరుగుతున్నాయని మోదీ తెలిపారు. మచ్చార్ తల్లి గీతాబెన్ భగవద్గీత బోధనలతో కుమారుడిని పెంచారని గుర్తుచేశారు. గాంధీ జయంతి రోజున అహింసకు నిజమైన అర్థాన్ని ప్రపంచానికి చూపించారని పేర్కొన్నారు. గుజరాత్‌కు చెందిన మచ్చార్‌తో కొద్దిసేపు గుజరాతీలోనూ మాట్లాడారు. మోదీతో మాట్లాడటం తనకు ఎంతో ప్రత్యేకమని మచ్చార్ భావోద్వేగానికి గురయ్యారు. ప్రధాని తన ఆరాధ్యుడని, ఆయన నుంచి ఫోన్ వస్తుందని ఊహించలేదన్నారు. ఆసుపత్రిలో అత్యుత్తమ వైద్యం అందుతోందని, త్వరలో పూర్తిగా కోలుకుంటాననే నమ్మకం ఉందన్నారు. బుధవారం బయల్దేరిన ఎఫ్‌జెడ్1073 విమానంలో 174 మంది ప్రయాణికులు, 27 మంది చిన్నారులు ఉన్నారు. కో–పైలట్ కాక్‌పిట్‌లో మచ్చార్‌పై కత్తితో దాడి చేసినట్లు సమాచారం. విమానం అత్యవసర సంకేతాలు పంపడంతో పాటు 34వేల అడుగుల ఎత్తు నుంచి ఒక్కసారిగా 17వేల అడుగులకు పైగా కిందికి దిగింది. అనంతరం సౌదీ అరేబియాలోని టబుక్ విమానాశ్రయానికి దారి మళ్లించారు. ప్రయాణికుడు, సిబ్బందిలో ఒకరు కాక్‌పిట్‌లోకి ప్రవేశించి కో–పైలట్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తెలిపారు. ఈ ఘటన 9/11 తరహా పెను విషాదాన్ని నివారించిందని ఆయన పేర్కొన్నారు.

త్వరలో ఆర్టీసీలో 4,538 పోస్టుల భర్తీ

- ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు
- మంత్రి పొన్నం కీలక ప్రకటన

ప్రజానావ, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ)లో సిబ్బంది కొరతను అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోంది. త్వరలోనే ఆర్టీసీలో ఖాళీగా ఉన్న 4,538 పోస్టులను భర్తీ చేయనున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులపై ఉన్న పనిభారం తగ్గించడంతో పాటు ఆర్టీసీ సేవలను మరింత బలోపేతం చేసేందుకు నియామకాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. టీజీఎసఆర్టీసీ యూనియన్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నేతలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించిన దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆర్థిక, సర్వీస్ సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తోందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఆర్టీసీలో సిబ్బంది కొరత కారణంగా ఇప్పటికే ఉన్న ఉద్యోగులపై పనిభారం పెరుగుతోందని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో 4,538 పోస్టుల నియామక ప్రక్రియను త్వరలో పూర్తి చేయనున్నట్లు మంత్రి తెలిపారు. కొత్త సిబ్బంది అందుబాటులోకి వస్తే డిపోలు, బస్సుల నిర్వహణతో పాటు ఇతర విభాగాల్లోనూ ఉద్యోగులపై భారం తగ్గే అవకాశం ఉంటుంది. ఆర్టీసీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు సిబ్బంది సంఖ్యను పెంచుతున్నట్లు మంత్రి వివరించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాత ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు అందుతున్నాయని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఉద్యోగుల ఆర్థిక భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2017 పీఆర్సీకి సంబంధించిన పెండింగ్ బకాయిలతో పాటు డీఏ బకాయిలను ప్రభుత్వం పరిష్కరించిందని మంత్రి తెలిపారు. 2013 నుంచి పెండింగ్‌లో ఉన్న బాండ్లను కూడా క్లియర్ చేసినట్లు చెప్పారు. ఆర్టీసీ ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) బకాయిలపై కూడా మంత్రి పొన్నం వివరాలు వెల్లడించారు. గతంలో రూ.1,205 కోట్లుగా ఉన్న పీఎఫ్ బకాయిలను ప్రస్తుతం రూ.600 కోట్లకు తగ్గించినట్లు తెలిపారు. అదేవిధంగా కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ (సీసీఎస్) బకాయిలు కూడా రూ.690 కోట్ల నుంచి రూ.300 కోట్లకు తగ్గినట్లు పొన్నం పేర్కొన్నారు. పీఎఫ్, సీసీఎస్ బకాయిలను చెల్లించేందుకు ప్రభుత్వం ప్రతి నెలా రూ.75 కోట్లు చెల్లిస్తోందని వివరించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలపైనా ప్రభుత్వం దృష్టి పెట్టిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మొత్తం 1,134 కారుణ్య నియామకాలను చేపట్టే ప్రక్రియను ప్రారంభించినట్లు చెప్పారు.

విధుల్లోకి తొలగించిన ఉద్యోగులు

వివిధ కారణాల తో గతంలో శాశ్వతంగా ఉద్యోగాల నుంచి తొలగించబడిన సుమారు 250 మంది ఆర్టీసీ ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకున్నట్లు పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తోందని తెలిపారు. ఇదిలా ఉండగా.. టీజీఎసఆర్టీసీ యూనియన్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నేతలకు మంత్రి పొన్నం పలు సూచనలు చేశారు. ఆయా డిపోలకు చెందిన అధ్యక్షులు, కార్యదర్శులతో సమన్వయం చేసుకోవాలని కోరారు. అన్ని డిపోల్లో పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మొత్తంగా 4,538 పోస్టుల భర్తీ పూర్తయితే కొంతవరకు తగ్గడంతో పాటు ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులపై పనిభారం తగ్గే అవకాశం ఉంది. అదే సమయంలో పెండింగ్ బకాయిల పరిష్కారం, కారుణ్య నియామకాలు, ఉద్యోగుల పునర్నియామకం వంటి చర్యలు ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమంపై ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల్లో భాగంగా నిలుస్తున్నాయి.

సర్ విచారణ మీ ఇంటి వద్దకే..

- కొత్త మార్గదర్శకాలు జారీ చేసిన ఈసీ
- ఓటుకు భద్రత కల్పించేలా నిర్ణయం

ప్రజానావ, హైదరాబాద్: తెలంగాణా రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై భారత ఎన్నికల సంఘం తాజా మార్గదర్శకాలను ఇచ్చింది. ఈ మేరకు ఓటర్లకు నష్టం జరగకుండా, ఇబ్బంది కలగకుండా వారి ఓటుకు భద్రత కల్పించేలా నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఎసఐఆర్ 2026 ప్రక్రియను ఓటర్లకు ఎలాంటి అస

జూలో మురుగు.. జీవాలకు ముప్పు

- దుర్వాసనతో సందర్శకుల అవస్థలు
- నీటి నిల్వలతో జంతువులకు అనారోగ్య భయం
- నాలా మళ్లింపుపై ఏళ్లుగా నిర్లక్ష్యం

ప్రజానావ, హనుమకొండ: హంటర్ రోడ్డులోని కాకతీయ జంతు ప్రదర్శనశాలలోకి ఎగువ ప్రాంతాల నుంచి మురుగునీరు చేరుతుండటంతో సందర్శకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగు దుర్వాసనతో జూ పరిసరాలు కంపుకొడుతుండగా, ఏళ్ల తరబడి ఎన్‌క్లోజర్లలో నివసిస్తున్న జంతువులు, పక్షుల పరిస్థితి కూడా ఆందోళనకరంగా మారింది. జూలోకి మురుగునీరు చేరకుండా నాలాను మళ్లించాల్సిన నగర పాలక సంస్థ అధికారులు ఏళ్లుగా పట్టించుకోవడం లేదని సందర్శకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై అటవీ శాఖ అధికారులు కలెక్టర్, నగర పాలక సంస్థ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని చెబుతున్నారు. వర్షాలు కురిసిన సమయంలో జూలోని ఎన్‌క్లోజర్లు, పరిసర ప్రాంతాల్లో పెద్దఎత్తున నీరు నిలిచిపోతోంది. ఈ నీటిని తాగడం వల్ల కొన్ని జంతువులు అనారోగ్యానికి గురవుతున్నట్లు అధికారులు గుర్తించారు. జూలోని



శంకర్ అనే పెద్దపులి కూడా పార్కులో ప్రవహించే మురుగు నీరు, ఎన్‌క్లోజర్, నైట్ షెల్టర్ పరిసరాలు అనుకూలంగా లేక అనారోగ్యానికి గురికావడంతో హైదరాబాద్‌లోని నెహ్రూ జులాజికల్ పార్కుకు తరలించారు. జూలో ఇన్‌ఛార్జి జంతు వైద్యుడు ఉన్నప్పటికీ జంతువుల ఆరోగ్య పరిస్థితిని మెరుగుపర్చేందుకు పూర్తిస్థాయి వైద్యుడిని నియమించాల్సిన అవసరం ఉందని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

మురుగు ప్రవాహం ఇలా..

నగరంలోని ఎగువ ప్రాంతాలైన ప్రకాశ్‌రెడ్డిపేట, దీన్‌దయాళ్ నగర్, జులైవాడ, పోస్టల్ కాలనీ, నందిహిల్స్ కాలనీ తదితర ప్రాంతాల నుంచి వర్షపు నీటితోపాటు ఇళ్లు, హోటళ్లు, అపార్ట్‌మెంట్లు, వ్యాపార సముదాయాల నుంచి వెలువడే మురుగంతా హంటర్ రోడ్డులోని జంతు ప్రదర్శనశాల నాలా మీదుగా రంగసముద్రం చెరువులోకి చేరుతోంది. భారీ వర్షాలు కురిసినప్పుడు వరద నీరు జూ పార్కులోకి చేరడంతో అక్కడి జంతువులు ఆ నీటిని తాగుతున్నాయి. నీరు నిలిచిపోవడం వల్ల దోమలు, ఈగలు విస్తరించి వాటి ద్వారా జంతువులకు వ్యాధులు సోకే ప్రమాదం ఉందని జంతు ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భూగర్భ డ్రైనేజీ పనుల్లో ప్రాధాన్యం ఇవ్వాలి

జిల్లా కలెక్టర్, నగర కమిషనర్, ప్రజాప్రతినిధులు జూ పార్కులో ప్రవహిస్తున్న మురుగునీటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. త్వరలో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ ప్రాజెక్టులో జూ పార్కుకు ప్రాధాన్యత కల్పించి మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దీనివల్ల సందర్శకులకు, జంతువులకు అసౌకర్యం లేకుండా చేయాల్సిన అవసరం ఉందన్నారు. జూ పార్కు అసిస్టెంట్ క్యూరేటర్ శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో కలెక్టర్, కమిషనర్‌లకు మురుగునీటిని మళ్లించాలని కోరామని, వారు సమస్యను పరిశీలించి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ప్రెస్ కౌన్సిల్ స్థానంలో మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి



- వనపర్తిలో జర్నలిస్టుల భారీ నిరసన ధర్నా
- జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు మంజూరు చేయాలి

ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో : ప్రస్తుతం ఉన్న ప్రెస్ కౌన్సిల్ స్థానంలో పూర్తి అధికారాలు కలిగిన మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయడంతో పాటు జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక రక్షణ చట్టం తక్షణమే తీసుకురావాలని టీ టియుడబ్ల్యూజే ఐజేయూ రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధుగౌడ్ డిమాండ్ చేశారు. గాంధీ జయంతి సందర్భంగా ఐజేయూ పిలుపు మేరకు శుక్రవారం వనపర్తి గాంధీ చౌక్‌లో యూనియన్ జిల్లా అధ్యక్షుడు మాధవరావు, కార్యదర్శి బి.రాజుల ఆధ్వర్యంలో జర్నలిస్టులు భారీ నిరసన ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మధుగౌడ్ మాట్లాడుతూ.. విలేకరులపై పెరుగుతున్న దాడులను అరికట్టాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం నూతన వేజ్ బోర్డు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డి, ఆర్డీవో సుబ్రహ్మణ్యంలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐజేయూ నాయకులు శ్రీనివాసులు, ఆంజనేయులు సాగర్, నరసింహరాజు, నల్లగొండ్ల హరీష్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రంతోనే.. ఆరోగ్యవంత సమాజ నిర్మాణం

- మున్సిపల్ కార్మికుల సన్మానం, వైద్య శిబిరంలో చైర్ పర్సన్ జిందం కళ

ప్రజానావ, సిరిసిల్ల : పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యవంత మైన సమాజం నిర్మాణమవుతుందని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ అన్నారు. శుక్రవారం మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని స్వచ్ఛత హి సేవ–2026 కార్యక్రమంలో భాగంగా సిరిసిల్ల పురపాలక సంఘ సన్మాన కార్యక్రమం" ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ ముఖ్య అతిథిగా హాజరై మున్సిపల్ పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, మహాత్మా గాంధీ కలలుగన్న స్వచ్ఛ భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా భాగస్వాములు కావాలని అన్నారు. సిరిసిల్ల పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సేవలు వెలకట్టలేనివని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ పారిశుధ్య కార్మికుల సేవలను గౌరవించాలని సూచించారు. నిత్యం ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ముందుండి పనిచేసే మున్సిపల్ పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకునేందుకు అశ్విని హాస్పిటల్స్, ఎల్లారెడ్డిపేట వారి సహకారంతో సిరిసిల్ల మున్సిపల్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో అశ్విని హాస్పిటల్స్ ఎండీ, సీఈఓ డాక్టర్ అభినయ్ గౌపర్ధనం ఆధ్వర్యంలలో నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఎండి. ఖాదిర్ ఫాషా మాట్లాడుతూ, మున్సిపల్ కార్మికులు, సిబ్బంది తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వైద్య శిబిరం ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మహాత్ముడి స్ఫూర్తితో సామాజిక న్యాయ తెలంగాణ సాధిస్తాం

- తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలు
- బాపూజీ స్మరణలో రక్తదాన శిబిరం



ప్రజానావ, హైదరాబాద్: మహాత్మా గాంధీ స్ఫూర్తితో సామాజిక న్యాయ తెలంగాణ సాధిస్తామని తెలంగాణ రక్షణ సేన నాయకులు అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నవీన్ ఆచారి, మాసన్నగారి బాలయ్య, కోల శ్రీనివాస్, వేముల భవాని, శివారెడ్డి, మనోజా గౌడ్, హలీమా తదితరులు పాల్గొన్నారు. బాపూజీ స్మరణలో పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కూకట్‌పల్లిలోని ఓమిని హాస్పిటల్స్ బ్లడ్ సెంటర్ నిర్వాహకులు రక్తాన్ని సేకరించారు. ఈ శిబిరంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు 45 మంది రక్తదానం చేశారు.

కెప్టెన్ స్మిత్ మచ్చర్ తెగువకు గవర్నర్ ప్రశంసలు



ప్రజానావ, హైదరాబాద్: ప్రమాదకర పరిస్థితుల్లో ప్రాణాలను లెక్కచేయకుండా 174 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన కెప్టెన్ స్మిత్ మచ్చర్ ధైర్యసాహసాలను తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా అభినందించారు. శుక్రవారం లోక్‌భవన్‌లో మాట్లాడుతూ.. విమానం ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న కీలక సమయంలో కెప్టెన్ అప్రమత్తత, సమయస్ఫూర్తితో వ్యవహరించారని పేర్కొన్నారు. కేవలం 30 సెకన్లు ఆలస్యమైనా పరిస్థితి మరింత విషమంగా మారేదని అన్నారు. అసాధ్యమనుకున్న పరిస్థితిని తన ధైర్యసాహసాలతో సాధ్యంగా మార్చి ప్రయాణికుల ప్రాణాలను కాపాడారని ప్రశంసించారు. కెప్టెన్ స్మిత్ మచ్చర్ చూపిన తెగువ, మానవతా దృక్పథం భారతదేశానికి గర్వకారణమని గవర్నర్ అన్నారు. ఆయన కుటుంబ సభ్యులను కూడా అభినందిస్తూ.. కెప్టెన్ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకుని మరింతకాలం సేవలందించాలని ఆకాంక్షించారు.

లాల్‌బహదూర్ శాస్త్రి నేటి తరానికి స్ఫూర్తిదాయకం



- నిరాడంబరత, నిజాయితీ, క్రమశిక్షణ, దేశభక్తికి ప్రతీకగా మాజీ ప్రధాని జీవితం
- విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన గవర్నర్

ప్రజానావ, హైదరాబాద్: మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఘన నివాళులర్పించారు. రహింపూర్‌లోని లాల్‌బహదూర్ మైదానం వద్ద ఉన్న శాస్త్రి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. లాల్‌బహదూర్ శాస్త్రి జీవితం నిరాడంబరత, నిజాయితీ, క్రమశిక్షణ, దేశభక్తి, నిస్వార్థ సేవకు ప్రతీకగా నిలిచిందన్నారు. అత్యున్నత పదవిలో ఉన్నప్పటికీ సాధారణ జీవన విధానాన్ని కొనసాగిస్తూ ప్రజాసేవకు తన జీవితాన్ని అంకితం చేసిన శాస్త్రి ఆదర్శాలు నేటికీ ప్రజలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజా జీవితంలో నైతిక విలువలు, నిజాయితీకి శాస్త్రి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారని గవర్నర్ అన్నారు. దేశ ప్రయోజనాలను వ్యక్తిగత ప్రయోజనాల కంటే ముందుగా ఉంచిన ఆయన నాయకత్వం భారత ప్రజాస్వామ్య చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని పేర్కొన్నారు.

ఫిల్మ్ ఛాంబర్ వద్ద ఉద్రిక్తత

- డాన్సర్స్ అసోసియేషన్ వివాదం ముదురుతున్న వేళ
- ఫెడరేషన్ సమావేశంలోకి అనుమతించలేదని సుమలత ఆగ్రహం
- కార్యవర్గం రద్దు, కొత్త ఎన్నికలపై తీవ్ర అభ్యంతరాలు



ప్రజానావ, హైదరాబాద్: నగరంలోని ఫిల్మ్ నగర్ ఫిల్మ్ ఛాంబర్ వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. తెలుగు ఫిల్మ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ముఖ్యాధికారుల సమావేశం జరుగుతున్న సమయంలో డాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు, ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ భార్య సుమలత ఒక్కసారిగా సమావేశం జరుగుతున్న ప్రదేశంలోకి వెళ్లారు. ఫెడరేషన్ నాయకులతో ఆమె తీవ్రస్థాయిలో వాగ్వాదానికి దిగడంతో అక్కడి వాతావరణం వేడెక్కింది. తనను సమావేశానికి అనుమతించక పోవడంపై ఆమె ఫెడరేషన్ పెద్దలను నిలదీశారు. డాన్సర్స్ అసోసియేషన్‌కు ఎన్నికై అధ్యక్షురాలిగా కొనసాగుతున్న తనను కీలక సమావేశానికి ఎందుకు అనుమతించడం లేదని ప్రశ్నించారు. తమ సంఘం ఆత్మగౌరవం, హక్కులను కాలరాస్తున్నారంటూ ఆరోపిస్తూ ఫిల్మ్ ఛాంబర్ ప్రాంగణం బయట ఆందోళనకు దిగడంతో కొంతసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా, డాన్సర్స్ అసోసియేషన్‌లో తలెత్తిన అంతర్గత విభేదాలు, పలు ఆరోపణల నేపథ్యంలో సుమలత నాయకత్వంలోని కార్యవర్గాన్ని రద్దు చేస్తున్నట్లు ఫెడరేషన్ ఇటీవల నిర్ణయం తీసుకుంది. అసోసియేషన్‌కు కొత్త కమిటీని ఎన్నుకునేందుకు ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు కూడా ప్రారంభించింది. అయితే ఫెడరేషన్ తీసుకున్న నిర్ణయం చట్టవిరుద్ధమని, తమ ప్యానెల్‌ను కావాలనే పక్కన పెట్టేందుకు కుట్రలు చేస్తున్నారని సుమలత వర్గం ఆరోపిస్తోంది. మరోవైపు కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌పై గతంలో విధించిన సహాయ నిరాకరణ నిర్ణయాన్ని కొనసాగిస్తున్నట్లు ఫెడరేషన్ స్పష్టం చేసింది. ఇండస్ట్రీలో ఆయనకు పని అనుమతులు ఇవ్వకూడదన్న ఫెడరేషన్ వైఖరిపై జానీ మాస్టర్ బృందం, ఆయన మద్దతుదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫెడరేషన్ తీరుపై న్యాయపరంగా, ఆందోళనల ద్వారా పోరాటం చేస్తామని వారు హెచ్చరిస్తుండటంతో టాలీవుడ్ డాన్సర్స్ అసోసియేషన్ వివాదం మరింత ముదురుతోంది.

మరదలిని పెళ్లి చేయలేదని మేనమామ ఇంటికే కన్నం

- స్నేహితుడితో కలిసి రెండు ఇళ్లలో చోరీ
- 6 తులాల బంగారం, 45 తులాల వెండి, నగదు స్వాధీనం

ప్రజానావ, మంచిర్యాల: తనకు ఇష్టమైన మరదలిని తనకు కాకుండా మరో వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేశారనే కోపంతో ఓ యువకుడు మేనమామల ఇళ్లకే కన్నం వేశాడు. స్నేహితుడితో కలిసి రెండు ఇళ్లలో చోరీకి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేయగా.. మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారం గ్రామంలోని కాసింపల్లిలో ఈ ఘటన చోటుచేసుకుంది. కేసు వివరాలను ఏసీపీ వెంకటేశ్వర్లు మీడియాకు వెల్లడించారు. బెల్లంపల్లి పట్టణంలోని కాంట్రాక్టర్ బస్తీకి చెందిన వెల్డింగ్ కార్మికుడు మహ్మద్ మగ్ధూం, సబ్బని లక్ష్మీ నారాయణ స్నేహితులు. ఇద్దరూ కలిసి మద్యం సేవించే సమయంలో మగ్ధూం తనకు ఇందారం గ్రామంలోని కాసింపల్లిలో ముగ్గురు మేనమామలు ఉన్నారని, తనకు మరదలంటే ఎంతో ఇష్టమని, ఆమెను తనకు కాకుండా మరో వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారని స్నేహితుడితో చెప్పేవాడు. ఎలాగైనా తన మామకు బుద్ధి చెప్పాలని తరచూ ప్రస్తావించేవాడు. ఈ క్రమంలో తన చిన్న మేనమామ షేక్ సలీం కుమారుడి వివాహం ఉండటంతో కుటుంబ సభ్యులు దుస్తులు కొనుగోలు చేసేందుకు హైదరాబాద్ వెళ్లిన విషయం మగ్ధూంకు తెలిసింది. దీంతో స్నేహితుడు లక్ష్మీ నారాయణతో కలిసి ద్విచక్రవాహనంపై ఇందారం చేరుకున్నాడు. ఇంటి తాళాలు పగులగొట్టి ముందుగా చిన్న మేనమామ ఇంట్లోని రూ.60 వేల నగదు, బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. అనంతరం పెద్ద మేనమామ ఖాజాపాషా ఇంట్లోనూ చోరీ చేసి కొన్ని బంగారు, వెండి ఆభరణాలను తీసుకుని అదే రాత్రి బెల్లంపల్లికి చేరుకున్నారు. చోరీ చేసిన నగదులో రూ.35 వేలను మగ్ధూం, రూ.25 వేలను లక్ష్మీ నారాయణ పంచుకుని హైదరాబాద్‌లో జల్సా చేసినట్లు పోలీసులు తెలిపారు. మిగిలిన బంగారు ఆభరణాలను హైదరాబాద్‌కు తీసుకెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై బెల్లంపల్లి నుంచి వెళ్తుండగా ఇందారం ఎక్స్‌రోడ్డు వద్ద పోలీసులు మగ్ధూంను పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి ఆరు తులాల బంగారం, 45 తులాల వెండి, రూ.13,300 నగదుతో పాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు సబ్బని లక్ష్మీ నారాయణ పరారీలో ఉన్నట్లు ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు.

స్పెషల్ ఎడ్యుకేటర్లకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజానావ, వేములవాడ: పీఎం శ్రీ జడ్పీ హెచ్ఎస్ హన్మాజిపేట పాఠశాలలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల కోసం స్పెషల్ గెస్ట్ ఎడ్యుకేటర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ శ్రీకాంత్‌రావు తెలిపారు. స్పెషల్ బీఈడీ చేసిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు అక్టోబర్ 3 నుంచి 10వ తేదీ వరకు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన వారికి నెలకు రూ.16,500 వేతనం అందజేయనున్నట్లు తెలిపారు.

క్వార్టర్ ఆవరణలో భారీ కొండచిలువ కలకలం

- సింగరేణి కార్మికుడి ఇంటి వద్ద ప్రత్యక్షం
- పట్టుకున్న స్నేక్ క్యాచర్ శేఖర్



ప్రజానావ, మందమర్రి: మందమర్రి పట్టణంలోని పోస్టాఫీస్ సమీపంలో సింగరేణి క్వార్టర్ ఆవరణలో భారీ కొండచిలువ ప్రత్యక్షమై కలకలం రేపింది. ఓ సింగరేణి కార్మికుడి ఇంటి ఆవరణలో కొండచిలువ కనిపించడంతో కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే పాములు పట్టే వ్యక్తికి సమాచారం అందించగా.. స్నేక్ క్యాచర్ శేఖర్ అక్కడికి చేరుకుని చాకచక్యంగా కొండచిలువను పట్టుకున్నారు. అనంతరం కొండచిలువను జనావాసాలకు దూరంగా అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి అక్కడ విడిచిపెట్టనున్నట్లు శేఖర్ తెలిపారు.

చందానగర్‌లో బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో



- పరిమిత కాలం పాటు వజ్రాభరణాల ప్రత్యేక ప్రదర్శన
- రూ.లక్షకు పైగా కొనుగోలుపై ఉచిత బంగారు నాణెం

ప్రజానావ, హైదరాబాద్: జోయాలుక్కాస్ చందానగర్ షోరూమ్‌లో 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో' ప్రత్యేక ప్రదర్శన ప్రారంభమైంది. వజ్రాభరణాల్లో నైపుణ్యం, సొబగులు, సరికొత్త డిజైన్లను ఒకే వేదికపై అందించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనలో పెళ్లిళ్లకు అనువైన అద్భుతమైన నగల సెట్‌లతో పాటు నిత్యం ధరించేందుకు వీలైన ఆధునిక ఆభరణాలను ప్రదర్శిస్తున్నారు. సంప్రదాయ వైభవాన్ని ఆధునికతతో మేళవించిన ప్రత్యేక డిజైన్లు ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయి. ప్రతి డిజైన్‌ను ప్రత్యేక కళాఖండంగా రూపొందించడంతో పాటు ప్రదర్శన జరిగే పరిమిత కాలంలో మాత్రమే అందుబాటులో ఉంచుతున్నారు. ఈ సందర్భంగా జోయాలుక్కాస్ గ్రూప్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జోయ్ అలుక్కాస్ మాట్లాడుతూ, వజ్రాల శాశ్వతమైన ఆకర్షణకు, ఆభరణాల రూపకల్పనలో తమ నైపుణ్యానికి 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో' నివాళిగా నిలుస్తుందని అన్నారు. హైదరాబాద్ తమ ప్రయాణంలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందని, పండుగల సమయంలో నిర్వహిస్తున్న ఈ ప్రదర్శన ద్వారా అందం, ప్రత్యేకత, అత్యుత్తమ కళాత్మకతను ప్రతిబింబించే డిజైన్లను వినియోగదారులు ఎంపిక చేసుకునే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రదర్శన సందర్భంగా రూ.లక్ష లేదా అంతకంటే ఎక్కువ విలువైన వజ్రాభరణాలను కొనుగోలు చేసే ప్రతి వినియోగదారుడికి ఉచితంగా ఒక బంగారు నాణెం అందించనున్నట్లు సంస్థ తెలిపింది. చందానగర్ షోరూమ్‌లో నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో' పరిమిత కాలం మాత్రమే అందుబాటులో ఉంటుందని, వజ్రాభరణాలపై ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

హైదరాబాద్‌లో హైలైఫ్ బ్రైడ్స్ ఎగ్జిబిషన్

ప్రజానావ, హైదరాబాద్: వివాహ వేడుకలకు అవసరమైన ఫ్యాషన్, డిజైనర్ దుస్తులు, ఆభరణాలు తదితర ప్రత్యేక ఉత్పత్తులతో హైలైఫ్ బ్రైడ్స్ ఎగ్జిబిషన్ హైదరాబాద్‌లో సందడి చేయనుంది. హైటెక్ సిటీలోని హెచ్‌ఐసీసీ–నోవాటెల్‌లో మూడు రోజుల పాటు ఈ ప్రదర్శన జరగనుంది. ఈ సందర్భంగా నటి రితు చౌదరి ఎగ్జిబిషన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నటి ప్రియాంక, మిస్ ఇండియా తెలంగాణ–2023 ఉర్మిళ చౌహాన్ తదితరులు పాల్గొని ఫ్యాషన్ షోకేస్‌లో సందడి చేశారు. ఈ కార్యక్రమానికి పలువురు ఫ్యాషన్ ప్రియులు, ఫ్యాషన్ ఔత్సాహికులు హాజరయ్యారు. పెళ్లి వేడుకలకు అవసరమైన వస్త్రువులు, అలంకరణలు,



దుస్తులు, ఆభరణాలపై ఆసక్తి ఉన్నవారికి ఈ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.

ఖాజాగూడలో 'షోబోట్ సోషల్' సందడి

ప్రజానావ, హైదరాబాద్: ఖాజాగూడలో క్రీడలు, కాఫీ, ఆతిథ్యాన్ని ఒకే వేదికపై అందించేలా ఏర్పాటు చేసిన 'షోబోట్ సోషల్–పికిల్ డిస్ట్రిక్ట్ × మడికేరి క్రాఫ్ట్ కాఫీ' ఘనంగా ప్రారంభమైంది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి జయేష్ రంజన్, ఐఏఎస్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ జి.సృజన, ఐఏఎస్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా.ఎం. రమేష్, ఐపీఎస్, మాజీ ఒలింపియన్, టెన్నిస్ క్రీడాకారుడు విష్ణువర్ధన్, క్రీడాకారిణి సాత్విక సమ, పికిల్‌బాల్ ప్రపంచకప్ పతక విజేత ప్రశాంతి, తెలంగాణ పికిల్‌బాల్ అసోసియేషన్ సభ్యుడు వంశీ తదితరులు



హాజరయ్యారు. షోబోట్ సోషల్ వ్యవస్థాపకుడు సందీప్ సిన్హా, సహ వ్యవస్థాపకురాలు తప్తి దత్తా, మడికేరి క్రాఫ్ట్ కాఫీ వ్యవస్థాపకురాలు సరితా సర్కార్‌తో పాటు పలువురు క్రీడా రంగ ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



కాలుష్యానికి కారణమెవరు!?


రాత్రి పగలు అనె తేడా లేకుండా ఎప్పుడు చుసిన కాలుచయం విరజిమ్ముతూనే ఉంది. మరి ఈ కాలుష్యం ఇంతలా పెరిగిపోవడానికి కారణమెవరు?. ఎందుకు ఇంతలా రోజురోజుకి పెరుగుతుంది? అంటే దీనికి ఎక్కడా సమాధానం లేకుండా పోయింది. చేతులుకాలాక ఆకులు పట్టుకున్నట్లు.. ఇప్పుడు చర్యలు చేపడితే ఎం లాభం? నిజంగా దీనికి నిజమైన సమాధానం చెప్పలేక అధికారులు చేతులెత్తేస్తున్నారు. ప్రతి ఏటా ఢిల్లీ ప్రభుత్వం కాలుష్యాన్ని నియంత్రించే చర్యలు కొన్ని ప్రకటిస్తుంది. శీతాకాలంలో పాలకులకు ఇది ఒక క్రమం తప్పలేని ఎజెండా.

ఢిల్లీ పేరు చెప్పగానే నేటి కాలంలో టక్కున గుర్తుకు వచ్చేది కాలుష్యం. కొన్ని ఏళ్లుగా ఢిల్లీని శాసిస్తున్నది ఈ కాలుష్య మహమ్మారి. రాత్రి పగలు అనె తేడా లేకుండా ఎప్పుడు చుసిన కాలుచయం విరజిమ్ముతూనే ఉంది. మరి ఈ కాలుష్యం ఇంతలా పెరిగిపోవడానికి కారణమెవరు?. ఎందుకు ఇంతలా రోజురోజుకి పెరుగుతుంది? అంటే దీనికి ఎక్కడా సమాధానం లేకుండా పోయింది. చేతులుకాలాక ఆకులు పట్టుకున్నట్లు.. ఇప్పుడు చర్యలు చేపడితే ఎం లాభం? నిజంగా దీనికి నిజమైన సమాధానం చెప్పలేక అధికారులు చేతులెత్తేస్తున్నారు. ప్రతి ఏటా ఢిల్లీ ప్రభుత్వం కాలుష్యాన్ని నియంత్రించే చర్యలు కొన్ని ప్రకటిస్తుంది. శీతాకాలంలో పాలకులకు ఇది ఒక క్రమం తప్పలేని ఎజెండా. సోమవారం కూడా మళ్ళీ అదే జరిగింది. పలురకాల నిర్మాణాలమీద నిషేధం విధించారు, కార్యాలయ వేళల్లో మార్పుచేర్పులు ప్రకటించారు, ఆఫీసులకు వచ్చిపనిచేసే సిబ్బందిలో సగంమందిని ఇంటినుంచి పనిచేయాలంటున్నారు, నగరం బయట రిజిస్టరయిన వాహనాల నగర ప్రవేశాన్ని అడ్డుకుంటున్నారు, పార్కింగ్ చార్జీలు డా పెంచారు. ఈ జాబితాలో ఏవి ఎప్పటినుంచి అమల్లోకి రాబోతున్నాయన్నది అటుంచితే, శీతాకాలం ప్రవేశం వర ఇష్టారాజ్యంగా సాగినవన్నీ, ఇప్పుడు అత్యంత ప్రమాదకరమైనవిగా తోచడం, పరిణమించడం విశేషం. ఇప్పటిచలి తాత్కాలికమేనని, అల్పపీడన ప్రభావం తగ్గితే పరిస్థితిలో కాస్తంత మార్పు రావచ్చని అంటున్నప్పటికీ, కాస్తంత అటూఇటూగా ఈ సంక్షోభం ఏటా ఎదుర్కోక తప్పనిదే. నిర్మాణాలు, ల్చివేతలమీద పూర్తిస్థాయి నిషేధాన్ని అటుంచితే, ఇప్పటి అమలులో ఉన్న 'నో ఫ్యూయల్—నో పీసీ' విధానాన్ని మరింత కఠినంగా అమలు చేస్తారట. ఆటోమేటిక్ నంబర్‌ప్లేట్ రికగ్నేషన్ కెమెరాలు ఉన్న ఐదువందల పెట్రోల్ బంకుల్లో పాతవాహనాలమీద విరుచుకు పడతారట. రెండున్నర లక్షలవాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయ బోతున్నట్టు, ఉన్న ఐదువేల ఎలక్ట్రిక్ బస్సులకు మరో నూటయాభై బస్సులను చేర్చి ప్రజారవాణాను మెరుగుపరచనున్నట్టు ప్రభుత్వం చెబుతోంది. పార్కింగ్ ఫీజులను భారీగా పెంచితే, ప్రజలు విధిగా ప్రజారవాణావైపు పరుగులు తీస్తారని అది బలంగా నమ్ముతున్నట్టు కనిపిస్తోంది. ప్రజలు నిజంగానే పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట మీదే ఆధార పడితే, ఢిల్లీలో ఉన్న ఆ వ్యవస్థ ఏమాత్రం సరిపోదు. పద్నాలుగువేల బస్సులు అవసరమైన చోట సగం మాత్రమే ఉన్నాయి, నగరంలోని మొత్తం ప్రయాణికుల్లో ఐదుశాతం జనాభాను మాత్రమే మెట్రో తీసుకుపోతోంది. ఇక, వెచ్చదనంకోసం ప్రజలు చెత్తనీ, బొగ్గూకట్టె లూ కాల్చకుండా నిరోధించడానికి తాత్కాలికంగా విద్యుత్ హీటింగ్ స్పాట్‌లు ఏర్పాటు చేస్తే ప్రజలంతా అక్కడి వెళ్ళి చలికాచుకుంటారని కూడా ప్రభుత్వం నమ్మకం. కాలుష్యకాలం కమ్ముకొచ్చినప్పుడు, బాణాసంచా వినియోగం కూడా ఒక పెద్దసమస్యగా, వివాదంగా మారడం ఏటా ఉన్నదే. టపాసుల వాడకంమీద ఆంక్షలు విధించా లంటూ దాఖలైన పిటిషన్‌మీద సుప్రీంకోర్టు బుధవారం తన అభిప్రాయాన్ని ప్రకటిస్తూ, పూర్తి నిషేధానికి తాను అనులం కాదని, అలాగని, రోజంతా కాల్చడానికి ఒప్పుకోనని వ్యాఖ్యానించింది. కొన్ని రకాల టపాసుల తయారీకి డా ఇకపై వీలు కలగబోతోంది. దీపావళినాడు బాణాసంచా కాల్చే విషయంలో సుప్రీంకోర్టు వైఖరిలో ఇటీవల పెనుమార్పు వచ్చిన విషయం తెలిసిందే. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఏలు బడిలో ఉన్నంతకాలం ఢిల్లీలో టపాసులమీద నిషేధం అమలైంది. మొదట్లో బేరియం లవణాలు లేని టపాసుల తయారీకి అనుమతించి నప్పటికీ, ఆ మినహాయింపు డా దుర్వినియోగం కావడంతో పూర్తి నిషేధం అమలైంది. పాలకుల, న్యాయస్థానాల చొరవవల్ల, పెరిగిన కాలుష్య భయం వల్ల ఢిల్లీ వాసుల్లో కూడా టపాసులమీద మోజు తగ్గింది. విపక్షంలో ఉండగా, ఈ నిషేధాన్ని తప్పుబడుతూ వచ్చిన బీజేపీ ఢిల్లీలో తాను అధికారంలోకి రాగానే టపాసులపై సర్వోన్నత న్యాయస్థానంతోనే సరే కానివ్వండని అనిపించుకుంది. పొరుగురాష్ట్రాల్లో పంటవ్యర్థాలను తగలబెట్టడం కూడా ఢిల్లీ కాలుష్యానికి ఒక బలమైన కారణం కనుక, పరిస్థితిలో మార్పు వస్తున్నా ఈ మారు కూడా ఆ ప్రభావాన్ని కాదనలేం. ఇప్పుడు ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించిన ప్రణాళికలో అనేకం గతకాలంలోనూ అమలు జరిగినవే. గద్దెమీద ఎవరున్నా ఈ తక్షణ ఉపశమన చర్యలనే మహాద్భుతమైనవిగా అభివర్ణించుకోవడం సహజం. గ్యాస్ చాంబర్‌లాగా తయారైన ఢిల్లీలో వాయురూపంలో ఉన్న విషాన్ని దిగమింగుతున్న సామాన్యులకు ఏటా వచ్చే ఈ ఆపదనుంచి విముక్తి ఎప్పుడో తెలియడం లేదు. అంటే ఈ ప్రశ్నకు సమాధానం దొరకని పరిస్థితి. ఇప్పటికైనా ఓ ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటూ కొన్ని కటినమైన నిర్ణయాలు అమలు చేస్తూ ఢిల్లీలో పేరుకుపోయిన కాలుష్య మహమ్మారిని పారద్రోలవచ్చు. ఆ దిశగా అధికారులు పాలకులు ఆచరణలో పెట్టి ఢిల్లీని కాపాడాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. లేదంటే మ్మున్ముందు మరింత ప్రాణాంతకంగా మరోచ్చునని సూచిస్తున్నారు.

పొరుగు రాష్ట్రాల్లో పంటవ్యర్థాలను తగలబెట్టడం కూడా ఢిల్లీ కాలుష్యానికి ఒక బలమైన కారణం కనుక, పరిస్థితిలో మార్పు వస్తున్నా ఈ మారు కూడా ఆ ప్రభావాన్ని కాదనలేం. ఇప్పుడు ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించిన ప్రణాళికలో అనేకం గతకాలంలోనూ అమలు జరిగినవే. గద్దెమీద ఎవరున్నా ఈ తక్షణ ఉపశమన చర్యలనే మహాద్భుతమైనవిగా అభివర్ణించుకోవడం సహజం. గ్యాస్ చాంబర్‌లాగా తయారైన ఢిల్లీలో వాయురూపంలో ఉన్న విషాన్ని దిగమింగుతున్న సామాన్యులకు ఏటా వచ్చే ఈ ఆపదనుంచి విముక్తి ఎప్పుడో తెలియడం లేదు. అంటే ఈ ప్రశ్నకు సమాధానం దొరకని పరిస్థితి.

చుంచుపల్లిలో భూ వివాదాల చిచ్చు

- **నిర్మాణాలు చేపట్టిన గిరిజనేతరులకు బెదిరింపులు**
- **ముసుగులో వసూళ్ల ఆరోపణలు**
- **పోలీసులకూ తప్పని తిప్పలు**



ప్రజానావ, కొత్తగూడెం: కొత్తగూడెం కార్పొరేషన్ విస్తరిస్తుండటంతో పరిసర గ్రామాల్లో భూ వివాదాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఏళ్లుగా ఇక్కడే స్థిరపడిన వారితో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి వ్యాపారాలు, నిర్మాణాలు చేపడుతున్నవారికీ భూ సమస్యలు తప్పడం లేదు. ముఖ్యంగా గిరిజనేతరులు నిర్మాణాలు చేపడుతున్నారంటే పలుపురు సంఘాల నాయకులు రంగంలోకి దిగి వివిధ కారణాలు చూపుతూ డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మామూళ్లు ఇవ్వని వారికి చట్టంలోని నిబంధనలు, లొసుగులను చూపిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. డబ్బులు చెల్లించేందుకు నిరాకరిస్తే న్యాయపరమైన సమస్యలు సృష్టిస్తూ ముప్పుతిప్పలు పెడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఇలాంటి వ్యవహారాలకు చుంచుపల్లి మండలం కేంద్రంగా మారిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారాల్లో కొందరికి వివిధ రాజకీయ పార్టీలకు చెందిన కీలక నేతల మద్దతు ఉన్నట్లు ఆరోపణలు రావడం మరింత చర్చనీయాంశంగా మారింది. వివిధ భూ వివాదాలకు సంబంధించి నెలల వ్యవధిలోనే ఇద్దరు కానిస్టేబుళ్లపై కేసులు నమోదు కావడంతో చుంచుపల్లి పరిస్థితిపై చర్చ జరుగుతోంది.

విక్రయించిన వారే మళ్లీ అడ్డం తిరుగుతున్నారు

1/70 చట్ట పరిధిలోని భూములను గిరిజనేతరులు కొనుగోలు చేయడానికి హక్కు లేదని, ఒకవేళ కొనుగోలు చేసినా వాటికి రిజిస్ట్రేషన్లు జరగవని నిబంధనలు చెబుతున్నాయి. దీంతో గతంలో భూములు విక్రయించిన వారి వారసులే తిరిగి వాటిపై హక్కులు కోరుతూ వివాదాలకు తెరలేపుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. భూములు కొనుగోలు చేసిన వారిని కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని, కొన్ని సంఘాలకు చెందిన నాయకులు గ్రూపులుగా ఏర్పడి వసూళ్లకు పాల్పడుతున్నారని బాధితులు చెబుతున్నారు. ఒకరి తర్వాత ఒకరు వెళ్లి భూముల యజమానులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోతున్నారు.

పోలీసులకూ తప్పని తిప్పలు

చుంచుపల్లి మండలంలో గతంలో ఓ ప్లాటు కొనుగోలు చేసిన మరో మండలంలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ కూడా భూ వివాదంలో చిక్కుకున్నట్లు తెలుస్తోంది. ఆ ప్లాటు విషయంలో గతంలోనే వివాదాలు ఉన్నట్లు సమాచారం. వెంచర్ నిర్వాహకులు, మరికొందరు వ్యక్తుల మధ్య తలెత్తిన వివాదంలో పలువురు కానిస్టేబుల్‌పై ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. మరోవైపు ఓ గిరిజన కానిస్టే బుల్‌కు, గిరిజనేతర వ్యక్తికి మధ్య భూ వివాదం కొనసాగు తుండగానే ఆ కానిస్టేబుల్ మరో గిరిజనుడికి భూమిని విక్ర యించినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో మంగళవారం ఆయనపై కూడా ఎఫ్ఐఆర్ నమోదైంది. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా తప్పనిసరి పరిస్థితుల్లో కేసులు నమోదు చేయాల్సి వస్తోందని కొందరు పోలీసులు వాపోతున్నట్లు సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో చుంచుపల్లి నుంచి మరో ప్రాంతానికి బదిలీపై వెళ్లడమే మంచిదనే అభిప్రాయాన్ని కొందరు సిబ్బంది వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.

పేదలపై దయలేని వసూళ్ల ఆరోపణలు

చుంచుపల్లి పరిసర ప్రాంతాల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన పలు వురు గిరిజనేతరులు దశాబ్దా లుగా నివాసం ఉంటున్నారు. పైసాపైసా కూడబెట్టుకుని ఇళ్లు నిర్మించుకుంటున్న వారిని కూడా భూ వివాదాల పేరుతో డబ్బులు డిమాండ్ చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇళ్ల నిర్మాణాలు సగం పూర్తయిన తర్వాత వచ్చి అడ్డుకోవడంతో సామాన్యులు నిర్మాణాలను నిలిపివేయ లేక, మరోవైపు డబ్బులు చెల్లించ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రని చెబుతున్నారు. గతంలో ఓ నియోజకవ ర్గానికి చెందిన కీలక నేత తండ్రి పెద్ద ఎత్తున ఇలాంటి వసూళ్లకు పాల్పడినట్లు బాధితులు గుర్తుచేస్తున్నారు. ఆయనకు ముడుపులు చెల్లించని దే నిర్మాణాలు ముందుకు సాగని పరిస్థితి ఉండేదని వారు ఆరోపిస్తున్నారు. భూముల పై ఉన్న చట్టపరమైన వివాదాలను పరిష్కరిం చడంతో పాటు అక్రమ వసూళ్లు, బెదిరింపుల ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



గాంధీజీ ఆశయాలే నేటి తరానికి మార్గదర్శకం

- **సత్యం, అహింస, స్వచ్ఛత, సేవా మార్గాలను ఆచరించాలి**
- **ఎమ్మెల్యే మేఘారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి**

ప్రజానావ, వనపర్తి: దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మా గాంధీ సాగించిన పోరాటం చిరస్మరణీయమని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా వనపర్తి పట్టణంలోని గాంధీచౌక్‌లో మహాత్మా గాంధీ విగ్రహానికి కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ఎమ్మెల్యే మేఘారెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మా గాంధీ పోషించిన కీలక పాత్రను, దేశానికి ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. గాంధీజీ చూపిన సత్యం, అహింస, స్వచ్ఛత, సేవా మార్గాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ సత్యం, అహింస, సేవ, స్వచ్ఛత వంటి విలువలను తన జీవితంలో ఆచరించి చూపిన మహాత్మా గాంధీ ఆశయాలు నేటి తరానికి మార్గదర్శకమన్నారు. గాంధీజీ బోధించిన విలువలను ప్రజలు జీవితంలో పాటిస్తూ సమాజ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. కార్యక్రమంలో పుర చైర్‌పర్సన్ మాధవి, వైస్ చైర్మన్ మధుసూదన్‌గౌడ్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు.

యాదాద్రి ప్లాంట్ నిర్వహణపై వివాదం

- **ప్రైవేటీకరణ ఆరోపణలపై జెన్‌కో వివరణ**
- **రూ.279.20 కోట్లకు పవర్‌మెక్‌కు నిర్వహణ పనులు**
- **ప్లాంట్ ప్రైవేటీకరణ కాదంటున్న యాజమాన్యం**
- **ఉద్యోగ సంఘాల అభ్యంతరాలు**



ప్రజానావ, యాదాద్రి భువనగిరి: యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ నిర్వహణకు సంబంధించిన కొన్ని కీలక పనులను ప్రైవేట్ సంస్థకు అప్పగించడంపై వివాదం నెలకొంది. 4,000 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఈ ప్లాంట్‌లో కోల్, యాష్ హ్యాండ్లింగ్‌తో పాటు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) పనులను పవర్‌మెక్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్‌కు మూడేళ్ల కాలానికి రూ.279.20 కోట్లకు అప్పగించినట్లు సమాచారం. దీనిపై విద్యుత్ ఉద్యోగ సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ప్రభుత్వ ప్లాంట్‌లోని కీలక సాంకేతిక పనులను ప్రైవేట్ సంస్థకు అప్పగించడం వల్ల భవిష్యత్తులో నిర్వహణ, పర్యవేక్షణపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అయితే ఈ వ్యవహారాన్ని ప్లాంట్ ప్రైవేటీకరణగా చూడటం సరికాదని జెన్‌కో వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ యాజమాన్యం, విద్యుత్తు ఉత్పత్తి, ప్రభుత్వ ఆధీనంలోని ఆస్తులు యథాతథంగా కొనసాగుతాయని, నిర్దిష్ట నిర్వహణ పనులను మాత్రమే సామర్థ్యం, అవసరాల దృష్ట్యా కాంట్రాక్ట్ సంస్థకు అప్పగించినట్లు పేర్కొంటున్నాయి. గతంలోనూ విద్యుత్తు సంస్థల్లో కోల్, యాష్ హ్యాండ్లింగ్ వంటి ప్రత్యేక పనులను ఔట్‌సోర్సింగ్ విధానంలో నిర్వహించిన సందర్భాలు ఉన్నాయని అధికారులు వివరిస్తున్నారు. మరోవైపు కాంట్రాక్ట్‌లో మెకానికల్, ఎలక్ట్రికల్, కంట్రోల్ అండ్ ఇన్‌స్ట్రుమెం టేషన్ విభాగాలకు సంబంధించిన ఆపరేషన్, నిర్వహణ పనులు కూడా ఉండటంతో ఉద్యోగ సంఘాలు అభ్యం తరం వ్యక్తం చేస్తున్నాయి. ప్లాంట్‌లో అవసరమైన స్థాయిలో జెన్‌కో ఇంజినీర్లు, సిబ్బంది అందుబాటులో ఉండగా కీలక పనుల పర్యవేక్షణను కాంట్రాక్ట్ సంస్థ పరిధిలోకి తీసుకురావడంపై వారు ప్రశ్నలు లేవనెత్తు తున్నారు. ప్లాంట్ పర్యవేక్షణ బాధ్యతలు జెన్‌కో ఇంజినీర్ల చేతుల్లోనే ఉండాలని ఉద్యోగ సంఘాల నేతలు కోరుతున్నారు. ఇదిలా ఉండగా కాంట్రాక్ట్ విలువ, సిబ్బంది అవసరాల అంచనాలు, ధరల మార్పు నిబంధనలపైనా ఉద్యోగ సంఘాలు ప్రశ్నలు సంధిస్తున్నాయి. మొదటి సంవత్సరానికి నిర్ణయించిన మొత్తానికి అదనంగా రెండో, మూడో సంవత్సరాల్లో ప్రైస్ వేరియేషన్ క్లాజ్ వర్తించడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీని వల్ల భవిష్యత్తులో వ్యయం పెరిగే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. అయితే నిర్వహణ ఖర్చులు, ఇంధ నం తదితర అంశాల్లో మార్పులను పరిగణనలోకి తీసుకునే విధంగానే ధరల మార్పు నిబంధనను పొందుపరిచినట్లు అధికార వర్గాల వివరణగా ఉంది. మొత్తం మీద యాదాద్రి ప్లాంట్ నిర్వహణ పనుల ఔట్‌సోర్సింగ్ చుట్టూ 'ప్రైవేటీకరణ' అనే ఆరోపణ, దానికి జెన్‌కో ఇస్తున్న వివరణల మధ్య వివాదం కొనసాగుతోంది. ప్లాంట్ ప్రభుత్వ యాజమా న్యంలోనే కొనసాగుతుం దని జెన్‌కో చెబుతుండగా, కీలక నిర్వహణ పనులు ప్రైవేట్ సంస్థకు అప్పగించ డంపై ఉద్యోగ సంఘాలు తమ అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నాయి.

కోట్లు ఖర్చు.. నెలలకే కూలిన కల్వర్టులు

- **రూ.22 కోట్లతో రెండు వరసల రహదారి**
- **ఒక్కో కల్వర్టుకు రూ.20 లక్షలు**
- **నాసిరకం పనులతో ప్రమాదం ముప్పు**



ప్రజానావ, మెదక్: ప్రజల రాకపోకలు సజావుగా సాగేందుకు నిర్మించిన రెండు వరసల తారు రహదారి కొద్దికాలానికే అధ్వానంగా మారడంతో ప్రయాణికులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మెదక్, సిద్దిపేట జిల్లాలను కలుపుతూ నిర్మించిన ఈ రహదారిలో నాణ్యతా ప్రమాణాలను పట్టించుకోకుండా పనులు చేపట్టారని ప్రజలు ఆరోపిస్తున్నారు. చేగుంట మండలం కర్నాల్‌పల్లి నుంచి కరీంనగర్, రాంపూర్, గొల్లపల్లి మీదుగా సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ వరకు గతంలో ఒక వరస బీటీ రోడ్డు మాత్రమే ఉండేది. దీనిని రెండు వరసలుగా విస్తరించేందుకు రూ.22 కోట్లు మంజూరు కాగా, టెండర్లు పూర్తిచేసి పనులను చేపట్టి ఏడాదిన్నరలో పూర్తి చేశారు. దీంతో దౌల్తాబాద్, మిరుదొడ్డి మండలాల ప్రజలకు హైదరాబాద్‌కు రాకపోకలు సాగించేందుకు మెరుగైన రహదారి సౌకర్యం ఏర్పడింది. అయితే ఇదే మార్గంలో నిర్మించిన మూడు కల్వర్టుల నాణ్యతపై ఇప్పుడు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒక్కో కల్వర్టు నిర్మాణానికి సుమారు రూ.20 లక్షలు వెచ్చించినప్పటికీ కొద్దికాలానికే వాటి పరిస్థితి అధ్వానంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. రాంపూర్ వద్ద నిర్మించిన కల్వర్టు ఇప్పటికే కోతకు గురై కూలిపోయే దశకు చేరుకుంది. భారీ వర్షం కురిస్తే కల్వర్టు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కల్వర్టుకు ఇరువైపులా మట్టి పోసి, దానిపై కంకర వేసి బీటీ రోడ్డు నిర్మించడంతో వర్షాలకు మట్టి కొట్టుకుపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. వర్షపు నీటికి మట్టి కోతకు గురికాకుండా కల్వర్టు పరిసరాల్లో రాళ్లు పేర్చాల్సి ఉన్నప్పటికీ ఆర్‌అండ్‌బీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోలేదని స్థానికులు చెబుతున్నారు. గొల్లపల్లి వద్ద రహదారిపై తారు తొలగిపోయి గుంతలు ఏర్పడుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే మరికొద్ది రోజుల్లో కల్వర్టుకు ఇరువైపులా కంకర బయటకు తేలి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన కల్వర్టులు, రహదారి పనులు పూర్తయిన కొద్దికాలానికే దెబ్బతినడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులు దుబ్బాక ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణలోనే జరిగినప్పటికీ ప్రస్తుతం రహదారి దుస్థితిని పట్టించుకునే వారు లేకుండా పోయారని స్థానికులు వాపోతున్నారు. కోట్ల రూపాయల ప్రజాధనంతో చేపట్టిన పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పక్కాగా అమలు చేయాలని, రహదారి మరింత అధ్వానంగా మారకముందే దెబ్బతిన్న కల్వర్టులు, రోడ్డు భాగాలకు తక్షణమే మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

పెట్రోల్ ట్యాంక్‌పై కూర్చోబెట్టి బైక్ రైడ్

- **యువకుల వెకిలి చేష్టలు**
- **సూర్యాపేటలో ప్రమాదకర విన్యాసాలు**
- **నిఘా పెంచి చర్యలు తీసుకోవాలని స్థానికుల వినతి**

ప్రజానావ, సూర్యాపేట: జిల్లా కేంద్రంలో కొందరు యువకుల ప్రమాదకర బైక్ విన్యాసాలు చర్చనీయాంశంగా మారాయి. గవర్నమెంట్ జూనియర్ కాలేజీ రోడ్డులో ఓ యువకుడిని బైక్ పెట్రోల్ ట్యాంక్‌పై కూర్చోబెట్టుకుని మరో యువకుడు వాహనం నడిపిన ఘటన స్థానికుల దృష్టిని ఆకర్షించింది. సాధారణంగా బైక్ సీటుపై కూర్చొని ప్రయాణించాల్సిన వ్యక్తిని పెట్రోల్ ట్యాంక్‌పై కూర్చోబెట్టి వాహనం నడపడం అత్యంత ప్రమాదకరమని స్థానికులు చెబుతున్నారు. బైక్ అదుపుతప్పినా, ఎదురుగా వాహనం వచ్చినా ఇద్దరూ కిందపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గవర్నమెంట్ జూనియర్ కాలేజీ రోడ్డుతో పాటు పట్టణంలోని పలు ప్రాంతాల్లోనూ కొందరు యువకులు బైక్‌లపై విన్యాసాలు చేస్తూ, రాష్ట్రంగా డ్రైవింగ్ చేస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. రోడ్లపై వేగంగా బైక్‌లు నడపడం, ప్రమాదకరంగా ప్రయాణించడం వల్ల ఇతర వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని చెబుతున్నారు. బహిరంగ రహదారులపై ఇలాంటి ప్రమాదకర డ్రైవింగ్‌ను అరికట్టేందుకు ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా గవర్నమెంట్ జూనియర్ కాలేజీ రోడ్డు పరిసరాల్లో నిఘా పెంచి, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ ప్రమాదకరం గా వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గాంధీ చూపిన బాటే సమాజానికి స్ఫూర్తి

ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

ప్రజానావ, సత్తుపల్లి: జాతిపిత మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస మార్గాలు నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయం, మెయిన్ రోడ్డులోని మహాత్మా గాంధీ విగ్రహాలకు ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా శాంతియుత, స్వచ్ఛమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. గాంధీజీ ఆచరించి చూపిన సత్యం, అహింస సిద్ధాంతాలను నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సమాజంలో శాంతి, సామరస్యం, స్వచ్ఛతను పెంపొందించేందుకు



గాంధీజీ చూపిన మార్గంలో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎండీ రెహానాబేగం, కమిషనర్ నరసింహ, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.



అన్నదాన ట్రస్టుకు రూ.1.10 లక్షల విరాళం

ప్రజానావ, వేములవాడ: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం నిత్య అన్నప్రసాదం ట్రస్టుకు హైదరాబాద్ గోనాపూర్‌కు చెందిన భక్తుడు కె. జలంధర్ రెడ్డి రూ.1,10,016 విరాళంగా అంద జేశారు. ఆలయ ప్రోటోకాల్ కార్యాలయంలో పీఆర్వో పెరిక శ్రీనివాస్‌కు నగదును అందించారు. అనంతరం శ్రీ భీమేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ శేషవస్త్రాలు, లడ్డూ ప్రసాదాలతో దాతను సత్కరించారు.

బావుసాయిపేటలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు



ప్రజానావ, కొనరావుపేట: రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామపంచాయతీలో శుక్రవారం రోజున జాతిపిత మహాత్మా గాంధీజీ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిం చారు. గ్రామ సర్పంచ్ షేక్ యాస్మిన్ ఫిరోజ్ పాషా గారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహాత్మా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీజీ దేశానికి చేసిన సేవలను, ఆయన చూపిన సత్యం, అహింస, శాంతి, స్వచ్ఛత మార్గాలను స్మరించుకున్నారు. గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టి గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని సర్పంచ్ షేక్ యాస్మిన్ ఫిరోజ్ పాషా కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తిక్కల,నవీన్ పంచాయతీ కార్యదర్శి రాధిక, వార్డు సభ్యులు గంగాధర్, నక్క ఎల్లయ్య, నందు గౌడ్, రమేష్, అంగన్వాడీ టీచర్ మాధవి, ఆశా వర్కర్లు రమ, బాబాయ్ తదితరులు పాల్గొని మహాత్మా గాంధీజీకి నివాళులు అర్పించారు.

కొలనూరు సింగిల్ విండో చైర్మన్‌కు ఘన సన్మానం

ప్రజానావ, కోనరావుపేట: రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట



మండలం కొలనూరు సింగిల్ విండో సహకార సంఘం చైర్మన్‌గా నాగా రం గ్రామానికి చెందిన బొమ్మన భాస్కర్‌రావు బాధ్యతలు చేపట్టడం గ్రామానికి గర్వకారణమని నాగారం గ్రామ సర్పంచ్ అప్పల నాగభూష ణం, ఉపసర్పంచ్ కీర్తన బ్రహ్మచారి అన్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బొమ్మన భాస్కర్‌రావు,ను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ నాగారం గ్రామానికి చెందిన వ్యక్తి కొలనూరు సింగిల్ విండో చైర్మన్‌గా ఎన్నిక కావడం గ్రామానికి గౌరవాన్ని తీసుకువచ్చిం దన్నారు. రైతుల సంక్షేమం కోసం సహకార సంఘం ద్వారా మరిన్ని సేవలు అందిస్తూ, రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్లలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు



ప్రజానావ, సిరిసిల్ల : సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూర దేవరాజు ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణ కూడలిలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు సూరదేవరాజు లు మాట్లాడుతూ సత్యాగ్రహం, అహింసా మార్గాలతో స్వాతంత్ర్య సాధనకు గాంధీజీ చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. గాంధీజీ చూపిన మార్గంలో కాంగ్రెస్ ప్రజా పాలన కొనసాగిస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ గాంధీజీ ఆశయాల బాటలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ వెల్ముల స్వరూప, గడ్డం నరసయ్య, చొప్పదండి ప్రకాష్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, కౌన్సిలర్లు కూరపాటి శ్రీశైలం, లింగంపల్లి గంగరాజు, బొద్దుల శ్రీనివాస్, ఆడెపు ప్రసాద్, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

ఆటో చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజానావ, మందమర్రి: ప్రయాణికుల సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా ప్రతి ఆటో చోదకుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించా లని మందమర్రి ఎస్సై జి. నరేష్ సూచించారు. మందమర్రిలో ఆటో చోదకులకు రహదారి భద్రత, ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. ఆటోలకు ఇరువైపులా తప్పనిసరిగా అద్దాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అద్దాలు లేకపోవడంతో వెనుక నుంచి వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఆటో చోదకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, రహదారి భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఎస్సై సూచించారు.



నేతన్నల మగ్గం మూగపోతుంటే.. హోటళ్ల గదులు ఎలా పెరిగాయి?

- కేటీఆర్ మూడు ప్రశ్నలకు సమాధానం చెప్పాలి
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ప్రజానావ, సిరిసిల్ల: సీఎం రేవంత్‌రెడ్డి సిరిసిల్ల సభ, ర్యాలీ విజయవంతం కావడంతో బీఆర్ఎస్ నాయకులు మతి భ్రమించి అబద్ధాలు చెబుతున్నారని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆరోపించారు. శుక్రవారం సిరిసిల్లలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశం లో ఆయన మాట్లాడారు. కేటీఆర్ 2006లో హోటల్ వ్యాపారం ప్రారంభించా మని, ప్రస్తుతం మూడు హోటళ్లు ఉన్నాయని చెబుతున్నారని, నేతన్నల మగ్గాలు మూగబోతుంటే ఆయన హోటళ్ల గదులు ఎలా పెరిగాయని ప్రశ్నించారు. ఆస్తుల లెక్క, పెట్టుబడుల మూలం, సిరిసిల్లకు చేసిన పని అనే మూడు ప్రశ్నలకు కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 2009 నుంచి 2026 వరకు ఆస్తులు భారీగా ఎలా పెరిగాయో వివరించాలన్నారు. బీఆర్ఎస్ ఖాతాలో ఉన్న వందల కోట్లపై కూడా ఆది శ్రీనివాస్ ప్రశ్నలు సంధించారు. కేటీఆర్ ఎమ్మెల్యేగా సిరిసిల్లకు చేసిందేమీ లేదని విమర్శించారు. మిడ్‌మానేరు, గుడిచెరువు, ట్యాంక్‌బండ్, బైపాస్ రోడ్డు తదితర అభివృద్ధి పనులపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ఆయన ఖండించారు. కాళేశ్వరం ప్రాజెక్టు, కలికోట సూరమ్మ ప్రాజెక్టు పనుల్లో భూసేకరణ లేకుండా శంకుస్థాపనలు చేసి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో సిరిసిల్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ఆది శ్రీనివాస్ అన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సూర దేవరాజు, ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.





గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యం

- యువత క్రీడల వైపు అడుగులు వేయాలి
- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ప్రజానావ, వేములవాడ : గ్రామీణ క్రీడాకారు లను ప్రోత్సహించడమే లక్ష్యం అని రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేములవాడలో నిర్వహి స్తున్న 52వ రాష్ట్రస్థాయి బాలుర కబడ్డీ పోటీలు, 36వ రాష్ట్రస్థాయి బాలికల కబడ్డీ పోటీలను రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే తో కలిసి ప్రారంభించారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ రాజన్న సన్నిధిలో క్రీడా పోటీలు ప్రారంభం కావడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు.. విద్యార్థినిలు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఒలంపిక్ జెండాను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆవిష్కరించి టార్చ్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి సుమారు 68 జట్లకు చెందిన 1,300 మందికి పైగా క్రీడాకారులు, కోచ్‌లు, మేనేజర్లు, పీటీలు, పీడీలు ఈ పోటీల్లో పాల్గొంటు న్నారని తెలిపారు. నాలుగు రోజుల పాటు జరిగే పోటీలకు హాజరైన క్రీడాకారులకు వసతి, భోజన సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని, పోటీలు ముగిసిన అనంతరం వారు తమ స్వస్థలాలకు క్షేమంగా చేరుకునేలా అవసరమైన సహకారం అందిస్తామని వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం యువతను క్రీడల వైపు ప్రోత్సహించేం దుకు ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఆది శ్రీనివాస్ తెలిపారు. యువత క్రమశిక్షణతో విద్యను అభ్యసిం చడంతో పాటు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీ సేందుకు సీఎం కప్ ద్వారా 42 రకాల క్రీడలకు ప్రోత్సాహం అందించి నట్లు పేర్కొన్నా రు. తెలంగాణ నుంచి కూడా ఒలింపిక్స్‌లో బంగారు పతకాలు సాధించే క్రీడాకారులను తయారు చేయాలనే లక్ష్యంతో రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావం తులైన క్రీడాకారు లకు సరైన అవకాశాలు కల్పిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు.

రాంగ్‌రూట్ ప్రయాణాలకు కూడళ్లే అడ్డా

- ఎత్తైన ఐలాండ్లు.. పనిచేయని సిగ్నళ్లు
- అడ్డదిడ్డంగా వాహనాల నిలిపివేతతో ప్రమాదాలకు నిలయాలుగా మారిన ప్రధాన చౌరస్తాలు



ప్రజానావ, నిజామాబాద్: నగరంలోని ప్రధాన కూడళ్లలో రాంగ్‌రూట్ ప్రయాణాలు, అడ్డదిడ్డమైన రాకపోక లు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ముఖ్యంగా కోర్టు చౌరస్తా రాంగ్‌రూట్ ప్రయాణాలకు కేరాఫ్‌గా మారింది. నగరంలో అత్యధిక రోడ్డు ప్రమాదాలు ఇక్కడే జరుగుతున్నా యని స్థానికులు చెబుతున్నారు. చౌరస్తాలోని ఐలాండ్ ఎత్తుగా ఉండటంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఒకరికొకరు కనిపించక ఢీకొంటున్నాయి. దీంతో ఐలాండ్ ఎత్తును తగ్గించడంతోపాటు రాంగ్‌రూట్ ప్రయాణాలను వెంటనే కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు. నగరం నుంచి వివిధ మండలాలకు వెళ్లే మార్గంలోని వర్ని చౌరస్తాలో నిత్యం రద్దీ నెలకొంటోంది. ఖిల్లా, నాగారం, పెద్దబజార్ వైపు నుంచి వచ్చే వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించ కుండా వేగంగా రోడ్డు దాటుతుండటంతో ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొంటున్నారు. ఈ క్రమంలో ప్రమాద బాధితులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా ఉన్నా యి. వర్ని చౌరస్తాలో ఐలాండ్ ఆకృతిని మార్చి, నిరంతరం పోలీసు పర్యవేక్షణ కొనసాగించాలని స్థానికులు కోరుతున్నా రు. నగరంలోని మరో ప్రధాన కూడలైన పులాంగ్ చౌరస్తాలో నూ పరిస్థితి సమస్యాత్మకంగా మారింది. అత్యంత రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఎడమవైపు వెళ్లే ఫ్రీ లెఫ్ట్ మార్గం వాహనదారులకు ఇబ్బందిగా మారుతోంది. హైదరాబాద్ వెళ్లే రహదారిపై కూడలి దాటిన వెంటనే ఉన్న మలుపులో ఆటోలను అడ్డదిడ్డంగా నిలిపివేస్తుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. దీనికి తోడు కొందరు రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తుండటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. బోధన్ బస్టాండ్ కూడలిలోనూ వాహనదారులు ఇష్టారాజ్యంగా రాకపోకలు సాగిస్తున్నారు. అడ్డదిడ్డంగా వాహనాలు నడపడంతోపాటు రోడ్లపైనే వాహనా లను నిలిపివేయడం సాధారణంగా మారింది. ఈ కూడలిలో ఏర్పాటు చేసిన సిగ్నళ్లు సక్రమంగా పనిచేయకపో వడంతో ట్రాఫిక్ నియంత్రణ మరింత కష్టంగా మారుతోంది. హైమదీమార్కెట్, బస్టాండ్ రెండూ పక్కపక్కనే ఉండటంతో ఈ చౌరస్తా నిత్యం వాహనాలు, ప్రజల రద్దీతో కిక్కిరిసిపో తోంది. ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతోపాటు ఐలాండ్లను పునర్వ్యవస్థీకరిం చడం, పనిచేయని సిగ్నళ్లను వెంటనే సరిచేయడం, రాంగ్ రూట్ ప్రయాణాలు, రోడ్లపై అడ్డదిడ్డంగా వాహనాల నిలిపివే తపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జాతీయ ఫొటోగ్రఫీ పోటీలో తెలంగాణ ఫొటోగ్రాఫర్ల సత్తా

- శ్రవణ్‌కు 'బెస్ట్ ఇమేజ్ ఆఫ్ ది ఇయర్'
- వనం శరత్‌బాబుకు 'ఎక్స్‌లెన్స్ అవార్డు

ప్రజానావ, వరంగల్: జాతీయ ఫొటోగ్రఫీ పోటీ–2026లో హనుమకొండ నగరానికి చెందిన ఫొటోగ్రాఫర్ శ్రవణ్ తడక్ల, వరంగల్ జిల్లా శంభునిపేటకు చెందిన వనం శరత్‌బాబు ప్రతిష్ఠాత్మక అవార్డులను అందుకున్నారు. 'మై ఇండియా: 80 ఇయర్స్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఫ్రీడమ్' ఇతివృత్తంతో ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహించిన ఈ పోటీలో దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాల నుంచి 182 మంది ఫొటోగ్రాఫర్లు 352 ఛాయాచిత్రాలను సమర్పించారు. వివిధ విభాగాల్లో మొత్తం 60 అవార్డులను ఎంపిక చేయగా.. శ్రవణ్ సమర్పించిన ఛాయాచిత్రం 'బెస్ట్ ఇమేజ్ ఆఫ్ ది ఇయర్'గా ఎంపికైంది. వనం శరత్‌బాబు సమర్పించిన చిత్రానికి 'ఎక్స్‌లెన్స్ అవార్డు ఆఫ్ ది ఇయర్–2026' దక్కింది. గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వికాస భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఉపకులపతి ప్రొఫెసర్ కె. గంగాధరరావు తదితరుల చేతుల మీదుగా శ్రవణ్ మెడల్, అవార్డును అందుకున్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తి, ఐక్యత, సంస్కృతి, వారసత్వం, వైవిధ్యం, దేశభక్తి, ప్రజల ఆకాంక్షలను దేశంలోని వివిధ ప్రాంతాల ఫొటోగ్రాఫర్ల సృజనాత్మక దృష్టితో ఆవిష్కరించడమే లక్ష్యంగా ఈ పోటీని నిర్వహించారు.





అసైన్‌మెంట్ భూముల్లో మట్టి దందా

- అనుమతులు రద్దు చేసి అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలి
- సీపీఐ జిల్లా నాయకుల డిమాండ్

ప్రజానావ, హనుమకొండ: దళితులు, నిరుపే దల అమాయకత్వం, పేదరికాన్ని ఆసరాగా చేసుకుని కొందరు దళారీల ప్రమేయంతో అసైన్‌మెంట్ భూముల్లో మట్టి దందాకు పాల్పడుతున్నారని సీపీఐ నాయకులు ఆరోపించారు. ఐనవోలు మండలం కొండపర్తి గ్రామంలో పేదలు సాగు చేసుకుని కుటుంబాలను పోషించుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కేటాయించిన అసైన్‌మెంట్ భూముల్లో మట్టి తవ్వకాలకు ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) హనుమకొండ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎదునూరి వెంకట్రాజం, కొట్టపాక రవి, ఐనవోలు మండల నాయకులు మాదాసి యాకూబ్ డిమాండ్ చేశారు. అక్రమ తవ్వకాలు జరుగుతున్న వ్యవసాయ భూము లను పార్టీ బృందం సందర్శించి పరిశీలించింది. సారవంతమైన, అన్ని రకాల పంటలు పండే వ్యవసాయ భూముల్లో నాలుగైదు గజాల లోతు వరకు మట్టి తవ్వడంతో అవి సాగుకు పనికిరాకుండా గుంతలుగా మారుతున్నాయని నాయకులు ఆరోపిం చారు. మైనింగ్ అధికారులు భూమి స్వభావం, మట్టి తవ్వకాలకు అనుమతి కోరుతున్న వ్యక్తుల వివరా లను పరిశీలించిన తర్వాతే అనుమతులు ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. భూమి స్వభావంపై మండల రెవెన్యూ అధికారులు నివేదిక కోరగా.. అది అసైన్‌మెంట్ భూమి అని నివేదించినప్పటికీ మైనింగ్ అధికారులు ఎవరి ఒత్తిడితో అనుమతులు ఇచ్చారనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని వారు తెలిపారు. ఈ వ్యవహారంలో రాజకీయ నాయకుల ప్రమేయం ఉన్నా, భూ మాఫియా, వ్యాపారుల హస్తం ఉన్నా ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే మట్టి తరలించి గుంతలుగా మార్చిన వ్యవసాయ భూములను సంబంధిత వ్యక్తులతోనే తిరిగి చదును చేయించి సాగుకు అనుకూలంగా మార్చాలని కోరారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ స్పందించి సమగ్రంగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు విజ్ఞప్తి చేశారు. అధికారులు స్పందించకపోతే సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

అండర్–14 క్రికెట్ జట్లకు ఎంపికలు

- ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 400 మందికి పైగా హాజరు
- ప్రతిభ ఆధారంగా 8 జట్ల ఎంపిక


ప్రజానావ, వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లా అండర్–14 క్రికెట్ జట్టును ఎంపిక చేసే ప్రక్రియలో భాగంగా నిర్వహించిన సెలెక్షన్స్‌లో ప్రతిభ కనబరి చిన క్రీడాకారులతో ఎనిమిది జట్లను ఎంపిక చేసిన ట్లు వరంగల్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. కరుణాపురం వంగాల పల్లిలోని వరంగల్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ మైదానంలో ఉదయం నుంచి నిర్వహించిన ఎంపికలకు ఉమ్మడి వరంగల్ జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో క్రీడాకారులు తరలివచ్చారు. 400 మందికి పైగా హాజరుకాగా.. సెలెక్షన్ కమిటీ ప్రతిభను పరిశీలించి ఎనిమిది జట్లను ఎంపిక చేసినట్లు శ్రీనివాస్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పెద్ది ప్రవీణ్‌గౌడ్, ఉపాధ్యక్షులు అచ్చ వెంకటేశ్వ రరావు, తోట రాము, మాజీ కార్యదర్శి మార్నేని ఉదయ్‌భానురావు, అసోసియేషన్ సభ్యులు డాక్టర్ పుల్లూరి శ్రీనివా స్‌గౌడ్, విజయ్, శంకర్, మెతుకు కుమార్, సురేష్, మట్టెడ కుమార్, బండారి ప్రభాకర్, ఏ. వేణుగో పాల్, అష్టల్, రాజ్‌కుమార్, సదానంద్‌యాదవ్ పాల్గొన్నారు.



విద్యుత్ కోతలపై రైతుల ఆందోళన

- ఉపకేంద్రాన్ని ముట్టడించిన అన్నదాతలు
- పంటలు ఎండిపోతున్నాయంటూ ఆవేదన

ప్రజానావ, కామారెడ్డి: విద్యుత్ సరఫరాలో తరచూ అంత రాయం ఏర్పడటంతో పంటలు ఎండిపోతున్నాయని ఆరోపిస్తూ రైతులు పెద్దకొడప్గల్ మండల కేంద్రంలోని విద్యుత్ ఉపకేంద్రాన్ని ముట్టడించి ఆందోళన చేపట్టారు. విద్యుత్ కోతల కారణంగా సాగు చేసిన పంటలకు అవసరమైన నీరు అందక ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి 12 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెబుతున్న రాజకీయ నాయకులు.. విద్యుత్ కోతల సమయంలో ఎక్కడ ఉన్నారని ప్రశ్ని స్తూ విమర్శలు చేశారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న పోలీసులు సబ్‌స్టేషన్ వద్దకు చేరుకుని వారితో మాట్లాడి నచ్చజెప్పారు. అనంతరం విద్యుత్ అధికారులతో సమస్యపై చర్చించారు. విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న అంతరాయాన్ని



పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ ఆందోళనలో కాటేపల్లి, పెద్దకొడప్గల్ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి పరిశీలనతోనే

సాగుపై సమగ్ర అవగాహన

- వరి పొలాలను సందర్శించిన రుద్రూర్ పరిశోధన కేంద్రం విద్యార్థులు
- రైతులతో సాగు విధానంపై చర్చ

ప్రజానావ, నిజామాబాద్: రుద్రూర్ వరి, చెరకు పరిశోధన కేంద్రానికి చెందిన విద్యార్థులు వర్ని మండలంలో వరి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలిం చారు. ఏఎంసీ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్‌బాబా, స్థానిక నాయకులు, రైతులతో కలిసి విద్యార్థులు వరి పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా వరి సాగు విధానం, పంట పెరుగుదల, సాగులో రైతులు




ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే సాగులో అనుసరిస్తున్న నూతన పద్ధతులు, ఇతర వ్యవసాయ అంశాలపై రైతులతో చర్చించారు. క్షేత్ర పర్యటనలో అఖిల, పల్లవి, నిహారిక, నిఖిత, అభినయ, జయశ్రీ పాల్గొన్నారు.

గుజరాత్‌లో యూసీసీకి రాష్ట్రపతి ఆమోదం

గుజరాత్: గుజరాత్‌లో యూనిఫాం సివిల్ కోడ్ (యూసీసీ) అమలుకు మార్గం సుగమమైంది. గుజరాత్ యూనిఫాం సివిల్ కోడ్ బిల్లు–2026కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. రాష్ట్రపతి భవన్ అధికారిక రికార్డుల ప్రకారం బిల్లుకు ఆమోదం లభించింది. దీంతో ఉత్తరాఖండ్ తర్వాత యూసీసీకి రాష్ట్రపతి ఆమోదం పొందిన రెండో రాష్ట్రంగా గుజరాత్ నిలిచింది. గుజరాత్ అసెంబ్లీ ఈ బిల్లును మార్చిలో ఆమోదించగా.. అనంతరం రాష్ట్రపతి ఆమోదం లభించింది. రాష్ట్ర ప్రభుత్వం చట్టాన్ని గెజిట్‌లో ప్రచురించింది. అయితే చట్టం పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చే తేదీని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా ప్రకటించాల్సి ఉంటుంది. ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్టం ద్వారా వివాహం, విడాకులు, వారసత్వం, సహజీవనం తదితర వ్యక్తి గత పౌర వ్యవహారాలకు ఒకే చట్టపరమైన విధానం వర్తించనుంది. మతంతో సంబంధం లేకుండా రాష్ట్రంలోని ప్రజలకు ఈ నిబంధనలు వర్తిస్తాయి. అయితే షెడ్యూల్డ్ తెగలు, రాజ్యాంగం ద్వారా ప్రత్యే కంగా రక్షించబడిన కొన్ని సంప్రదాయ హక్కులు కలిగిన వర్గాలకు మినహాయింపు ఉంటుంది. యూసీసీలో భాగంగా వారసత్వ ఆస్తి హక్కుల్లో కుమారులు, కుమార్తెలకు సమాన హక్కులు కల్పించే నిబంధనలు ఉన్నాయి. వివాహాల నమోదు తో పాటు సహజీవన సంబంధాల నమోదుకు కూడా నిబంధన లు తీసుకొచ్చారు. వివాహ బంధం నుంచి విడిపోవ డానికి కూడా చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించా ల్సి ఉంటుంది. సహజీవన సంబంధాల్లో ఉన్నవారి హక్కులు, బాధ్యతలకు సంబంధించి కూడా చట్టంలో నిబంధనలు పొందుపరిచారు. వివా హం, విడాకు లు, వారసత్వం, సహజీవనం వంటి అంశాలకు మతాల వారీగా వేర్వేరు వ్యక్తిగత చట్టాల కు బదులుగా ఒకే చట్టపరమైన వ్యవస్థను అమలు చేయడమే యూసీసీ ఉద్దేశంగా ప్రభుత్వం పేర్కొంది. మహిళల హక్కులకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు అన్ని మతాల మహిళలకు సమాన హక్కులు కల్పించడమే లక్ష్యమని ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ అసెంబ్లీలో పేర్కొన్నారు.

హోటల్ గదిలో మహిళ, యువకుడి
అనుమానాస్పద మృతి

- **భార్యాభర్తలుగా చెప్పుకుని హోటల్‌లో బస**
- **ఉరివేసుకున్న స్థితిలో మృతదేహాలు లభ్యం**



లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని బహ్రైచ్ జిల్లాలో ఓ వివాహిత మహిళ, యువకుడు అనుమానాస్పద స్థితి లో మృతి చెందారు. వారిద్దరూ భార్యాభర్తలుగా పేర్కొంటూ హోటల్ గదిలో బస చేయగా.. ఉరివేసు కున్న స్థితిలో మృతదేహాలు కనిపించడంతో పోలీసు లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నోయి డాకు చెందిన 46 ఏళ్ల వివాహిత పింకీకి శ్రావస్తికి చెందిన 27 ఏళ్ల రింకూతో సోషల్ మీడియా ద్వారా పరిచయం ఏర్పడింది. అనంతరం వారి మధ్య సాన్ని హిత్యం పెరిగింది. ఈ క్రమంలో వారిద్దరూ భార్యా భర్తలుగా పేర్కొంటూ బహ్రైచ్‌లోని ఓ హోటల్‌లో గదిని తీసుకుని రెండు రోజుల పాటు బస చేశారు. అయితే ఉదయం నుంచి గదిలో ఎలాంటి కదలికలు కనిపించకపోవడంతో హోటల్ సిబ్బందికి అనుమా నం వచ్చింది. వారు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు హోటల్‌కు చేరుకుని గది తలుపులు తెరిచి పరిశీలించారు. గదిలో పింకీ, రింకూ ఉరివేసుకున్న స్థితిలో కనిపించడంతో వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా, పింకీని నోయిడా నుంచి రింకూ తీసుకువచ్చాడని ఆమె కుటుంబ సభ్యు లు ఆరోపించారు. ప్రాథమికంగా ఇది ఆత్మహత్య ఘటనగా కనిపిస్తోందని పోలీసు అధికారి తెలిపారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత మరణాలకు సంబంధించిన కారణాలపై స్పష్టత వస్తుందని పేర్కొన్నారు. ఘటనకు దారితీసిన పరిస్థితులను నిర్ధారించేందుకు కుటుంబ సభ్యుల వాంగ్మూలాలతో పాటు మొబైల్ ఫోన్ కాల్ వివరాలు, ఇతర ఆధారాలను పరిశీలిస్తున్నట్లు పోలీసు అధికారి వెల్లడించారు.

సీఈసీని తొలగించాలంటూ నిరసనలు

- **జంతర్ మంతర్ ఆప్, యూత్ కాంగ్రెస్ నిరసనలు**
- **జంతర్ మంతర్ వద్ద ఇంటర్నెట్ సేవలు నిలిపివేత**



న్యూఢిల్లీ: కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్? జ్ఞానేశ్? కుమార్?ను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆప్?, యూత్? కాంగ్రెస్?, పలు స్టూడెంట్ యూని యన్?లు శుక్రవారం జంతర్ మంతర్? వద్ద నిరసన లు చేపట్టాయి. 'సేవ్? డెమెక్రసీ' పేరుతో చేపట్టిన ఈ ఆందోళనలకు దిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించి నప్పటికీ, యూత్? కాంగ్రెస్?, ఆమ్? ఆద్మీ పార్టీ (ఆప్?) వెనక్కు తగ్గలేదు. దీనితో జంతర్? మంతర్? వద్దకు చేరుకున్న ఆప్ నేతలు ఆతిశీని, సౌరభ్ భరద్వాజ్?ను, సుమారు 150 మంది ఆప్?, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీనితో అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు, ఆందోళనకారుల మధ్య తోపులాట జరిగింది. వారిని అడ్డుకునేందుకు పోలీసులు లాఠీ ఛార్జ్ చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్?ఐఆర్?) ద్వారా అక్రమంగా ఓటర్లను పెద్ద ఎత్తున తొలగించారంటూ సీఈసీ జ్ఞానేశ్?కుమార్?పై ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆయన సీఈసీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జంతర్? మంతర్? వద్ద యూత్? కాంగ్రెస్, ఆప్? కార్యకర్తలు నిరసనలు చేపట్టారు. దీనితో అనుమతి లేకుండా నిరసనలు చేస్తున్నారంటూ దిల్లీ ఆప్ అధ్యక్షుడు సౌరభ్ భరద్వాజ్?, ఎమ్మెల్యే సంజీవ్ ఝాలను దిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు జంతర్ మంతర్ వద్దకు వెళ్లకుండా ఆప్? నేత, రాజ్యసభ ఎంపీ సంజయ్? సింగ్?ను నార్త్ అవెన్యూ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. తాము శాంతియుతంగా నిరసన తెలుపుతున్నప్పటికీ, తనను, ఝాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని ఆప్ నేత భరద్వాజ్? ఎక్స్? వేదికగా ఓ పోస్టు పెట్టారు. తమను అరెస్టు చేసినప్పటికీ, ఆందోళనలు కొనసాగిం చేందుకు, జంతర్? మంతర్? వద్దకు చేరుకోవాలని ఆప్? పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులను ఆయన కోరారు. తమ నిరసనలకు అనుమతి లేదని పోలీసులు చెప్పారని, అయితే ప్రజాస్వామ్యంలో తన నిరసనలు చేయడానికి అనుమతి అవసరమా అని ఆయన ప్రశ్నించారు. "సుమారు వారం రోజుల క్రితమే తాము జంతర్ మంతర్ వద్ద నిరసనలకు అనుమతి కోరుతూ పోలీసులకు లేఖ ఇచ్చాం. అయినప్పటికీ వారు అనుమతి ఇవ్వలేదు. అందుకే మా ఆందోళనలను వ్యక్తం చేయడానికి, మా ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకుంటున్నాం" అని సౌరభ్ భరద్వాజ్ పేర్కొన్నారు. జంతర్ మంతర్? సమీపంలోని పలు మెట్రో స్టేషన్లను మూసివేశారని, అందువల్ల ప్రజలు సమీపంలో తెరచి ఉన్న మెట్రో స్టేషన్లలో ప్రయాణించాలని, వీలైతే నిరసన ప్రదేశానికి నడిచి వెళ్లాలని ఆయన కోరారు. ఆప్, విద్యార్థి సంఘాలు జంతర్ మంతర్ వద్ద నిరసనలు చేపట్టనున్నట్లు ముందే ప్రకటించిన నేపథ్యంలో, శుక్రవారం పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా భద్రతను కట్టుదిట్టం చేశారు. దిల్లీలోని రాజీవ్? చౌక్?, సెంట్రల్ సెక్రటేరియట్?, జంతర్ మంతర్? సహా 12 స్టేషన్లలో ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను మూసివేశారు. అంతేకాదు జంతర్ మంతర్ పరిసరా ల్లో ఇంటర్నెట్ సేవలు కూడా నిలిపివేశారు. జనపథ్?, పటేల్ చౌక్?, సెంట్రల్? సెక్రటేరియట్?, బారాఖం బా, సేవ్ తీర్థ్?, మండి హౌస్?, లోక్ కల్యాణ్? మార్గ్?, ఐఎన్?ఏ, చావ్రి బజార్?, రామకృష్ణ ఆశ్రమ్? మార్గ్?, దిల్లీ స్టేషన్లను తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు మూసివేస్తున్నట్లు డీఎంఆర్?సీ సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. అయితే రాజీవ్? చౌక్?, మండి హౌస్?, దిల్లీ, సెంట్రల్ సెక్రటేరియట్ స్టేషన్లలో ఇంటర్?ఛేంజ్ సౌకర్యం ఉందుబాటులో ఉంటుందని స్పష్టం చేసింది. ఆప్, ఆల్? ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ ?, నేషనల్? స్టూడెంట్స్? యూనియన్ ఆఫ్ ఇండియా , ఇండియన్ యూత్ కాంగ్రెస్ జంతర్ మంతర్? వద్ద నిరసనలు చేపట్టా యి. అయితే ఈ నిరసనలకు ముందుగా పోలీసులు అనుమతి నిరాకరించారు. సున్నితమైన ప్రదేశాల్లో కేంద్ర సాయుధ బలగాలను మోహరించారు. రాకపోకలను నియంత్రించడానికి, అనధికారిక సమావేశాలను నిరోధించడానికి బారికేడ్లు ఏర్పాటు చేశారు.

గణేశ్ నిమజ్జనం పూర్తయింది..
జ్ఞానేశ్ నిమజ్జనం మిగిలింది

- **సీఈసీ రాజీనామా డిమాండ్‌కు ప్రకాశ్‌రాజ్ మద్దతు**
- **దేశవ్యాప్త ఆందోళనలకు ప్రజలు అండగా నిలవాలని పిలుపు**



ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ దేశవ్యాప్తంగా జరుగు తున్న ఆందోళనలకు నటుడు ప్రకాశ్‌రాజ్ మద్దతు ప్రకటించారు. 'దేశంలో గణేశ్ నిమజ్జనం పూర్త యింది.. జ్ఞానేశ్ నిమజ్జనం మిగిలి ఉంది' అంటూ ఆయన వ్యాఖ్యానించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా, ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా పునర్విమర్శ ప్రక్రియకు వ్యతిరేకంగా ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్‌తో పాటు వివిధ రాజకీయ, పౌరసమాజ సంస్థలు ఆందోళనలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రకాశ్‌రాజ్ స్పందించారు. ఢిల్లీ, ముంబై సహా పలు ప్రాంతాల్లో జరుగుతున్న నిరసనల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం సామాజిక మాధ్యమం ద్వారా ఓ వీడియోను విడుదల చేశారు. జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించే వరకు జరిగే ఆందోళనలకు ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. సీఈసీ రాజీనామా డిమాండ్‌తో 'కాక్రోచ్ జంతా పార్టీ' కూడా ఆందోళనకు దిగడంపై స్పందించిన ప్రకాశ్‌రాజ్.. 'కాక్రోచ్‌లు తిరిగి వస్తున్నారు.. హ్యాపీ జయంతి' అంటూ వ్యాఖ్యానించారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాపు జన్మదినాన్ని ఘనంగా జరుపుకుంటున్నప్పటికీ, గాంధీని హత్య చేసిన నాథూరామ్ గాడ్సేను ఇప్పటికీ కొందరు కీర్తిస్తున్నారని విమర్శించారు. అలాంటి వారు పౌర హక్కులు, ప్రజాస్వామ్యాన్ని అణచివేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిం చారు. అయితే పౌర సమాజం, దేశ యువత, 'కాక్రోచ్‌లు' అలాంటి ప్రయత్నాలను సాగనివ్వరని అన్నారు. జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాల్సిన సమయం వచ్చిందని ప్రకాశ్‌రాజ్ పేర్కొన్నారు.

అశోక చక్రకు పైలట్ స్మిత్ మచ్చర్ పేరు?

- **విమానాన్ని కూల్చే కుట్రను భగ్నం చేసి 180 మంది ప్రాణాలు కాపాడిన ధైర్యానికి కేంద్రం గౌరవం**



న్యూఢిల్లీ: ఫ్లైదుబాయ్ పైలట్ స్మిత్ మచ్చర్‌ను దేశ అత్యున్నత శాంతికాల వీరత్వ పురస్కారమైన అశోక చక్రతో సత్కరించే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. దుబాయ్ నుంచి ఇజ్రా యెల్‌కు వెళ్తున్న విమానాన్ని కోపైలట్ కూల్చేందుకు ప్రయత్నించగా, ఆ కుట్రను భగ్నం చేసి సుమారు 180 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన భారతీయ పైలట్ స్మిత్ మచ్చర్‌పై ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. అత్యంత ధైర్యసాహ సాలు ప్రదర్శించిన వారికి అశోక చక్ర పురస్కారాన్ని ప్రదానం చేస్తారు. మచ్చర్ ప్రదర్శించిన తెగువను ఇప్పటికే పలువురు ప్రముఖులు ప్రశంసించారు. భారత ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ సైతం ఆయనను హీరోగా కొనియాడినట్లు సమాచారం. గుజరాతీ మూలాలున్న మచ్చర్ ధైర్యసాహసాలను గుర్తించిన గుజరాత్ ప్రభుత్వం ఇప్పటికే విశిష్ట గుజరాత్ గిరిమా అవార్డును ప్రకటించింది. ఆయన త్వరగా కోలుకో వాలని ఆకాంక్షిస్తూ సోమనాథ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, కాశీ విశ్వనాథ్ ఆలయంలో నూ పూజలు చేశారు. మచ్చర్‌కు అశోక చక్ర పురస్కారం లభిస్తే, ఈ గౌరవాన్ని అందుకున్న రెండో ఏవియేషన్ రంగానికి చెందిన వ్యక్తిగా ఆయన నిలిచే అవకాశం ఉంది. 1987లో పాన్ ఆమ్ ఫ్లైట్ 73లో సీనియర్ ఫ్లైట్ పర్సర్‌గా పనిచేసిన నీరజ్ భానోత్‌కు గతంలో అశోక చక్ర ప్రదానం చేశారు. హైజాక్‌కు గురైన ఆ విమానంలోని ప్రయాణికులను రక్షించే క్రమంలో నీరజ్ భానోత్ తన ప్రాణాలను త్యాగం చేశారు.

పికప్ వ్యాన్‌ను ఢీకొన్న ట్రక్కు.. ఏడుగురు మృతి

- **21 మందికి గాయాలు..**
- **ఐదుగురి పరిస్థితి విషమం**



ప్రజానావ, ముంబై : మహారాష్ట్రలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందగా, మరో 21 మంది గాయపడ్డారు. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. శుక్రవారం ఉదయం అమరావతి జిల్లా ధామంగోన్ రైల్వే స్టేషన్ సమీపంలోని సమృద్ధి ఎక్స్‌ప్రెస్‌వేపై ఛానల్ 97 వద్ద ఈ ప్రమాదం జరిగింది. కొంతమంది భక్తులు నవ రాత్రి వేడుకల్లో పాల్గొనేందుకు పికప్ వ్యాన్‌లో ఆలయానికి బయలుదేరారు. బుల్దానా జిల్లాలోని షెగావ్ నుంచి వార్ధాకు వెళ్తుండగా పికప్ వ్యాన్‌ను వేగంగా వచ్చిన ట్రక్కు ఢీకొంది. ట్రక్కు బలంగా ఢీకొనడంతో వ్యాన్‌లో ఉన్న ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు ఆస్పత్రికి తరలిస్తుం డగా ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదంలో 21 మంది గాయపడగా, వారిలో ఐదుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. వ్యాన్‌లో చిక్కుకున్న బాధితులను బయటకు తీసి క్షతగాత్రుల ను స్థానిక ఆస్పత్రులకు తరలించారు. దామంగోన్ గ్రామీణ ఆస్పత్రిలో పలువురికి చికిత్స అందిస్తున్నా రు. మృతుల వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసు లు దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి దారితీసిన కచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. ప్రమాదంలో మృతి చెందిన వారికి మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సునేత్ర పవార్ నివాళులర్పించారు. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు.


సరిహద్దు దాటేందుకు యత్నం

- **ఇద్దరు పాకిస్థానీలు హతం**
- **హెచ్చరికలను బేఖాతరు చేయడంతో బీఎస్ఎఫ్ కాల్పులు**
- **ఒకరు తిరిగి పాకిస్థాన్‌లోకి పరార్**

అమృత్‌సర్: భారత్‌లోకి అక్రమంగా చొరబడేందుకు ప్రయత్నించిన ఇద్దరు పాకిస్థానీలను బీఎస్ఎఫ్ జవాన్లు కాల్చి చంపారు. పంజాబ్‌లోని తర్న్ తరన్ సెక్టార్‌లో రాజొకే గ్రామ సమీపంలోని భారత్–పాకిస్థాన్ అంతర్జాతీయ సరిహద్దు వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. పాకిస్థాన్‌లోని చత్తన్‌వాలె ప్రాంతం నుంచి ముగ్గురు వ్యక్తులు అర్ధరాత్రి సమయంలో భారత భూభాగంలోకి అక్రమంగా ప్రవేశించేందుకు ప్రయత్నించారు. సుమారు రాత్రి 12.30 గంటల సమయంలో సరిహద్దు వద్ద కదలికలను గుర్తించిన బీఎస్ఎఫ్ సిబ్బంది వెంటనే అప్రమత్తమై వారిని ఆగిపోవాలని హెచ్చరించారు. పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ వారు చొరబాటు యత్నాన్ని కొనసాగించడంతో బీఎస్ఎఫ్ జవాన్లు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఇద్దరు చొరబాటుదారులు మృతి చెందగా, మరో వ్యక్తి తిరిగి పాకిస్థాన్ వైపు పారిపోయాడు. తమ హెచ్చరికలను బేఖాతరు చేసి భారత భూభాగంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో కాల్పులు జరిపినట్లు బీఎస్ఎఫ్ తెలిపింది. పంజాబ్ సరిహద్దు ప్రాంతంలో గతం లోనూ పలు అక్రమ చొరబాటు యత్నాలను భద్రతా బలగాలు గుర్తించడంతో అక్కడ నిఘాను మరింత కట్టుదిట్టం చేశాయి. అందులో భాగంగానే తాజా చొరబాటు ప్రయత్నాన్ని భగ్నం చేసినట్లు అధికా రులు తెలిపారు. గత జూలైలోనూ ఓ వ్యక్తి భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించేందుకు ప్రయత్నించగా, బీఎస్ఎఫ్ జవాన్లు కాల్పులు జరపడంతో అతడు తిరిగి పాకిస్థాన్ వైపు వెళ్లిపోయాడు. ఇటీవలి కాలంలో అంతర్జాతీయ సరిహద్దు వెంబడి కేంద్ర ప్రభుత్వం భద్రతను మరింత పెంచింది. సరిహద్దులోని పలు ప్రాంతాల్లో కంచె నిర్మాణ పనులను కూడా చేపడుతోంది.

198 మంది ముస్లిం ఓటర్ల పేర్ల
తొలగింపునకు యత్నం

- **బీజేపీ నేత రవి పాటిల్‌తో పాటు 20–25 మందిపై కేసు**
- **నకిలీ పత్రాలతో 'ఫారం–7' సమర్పించేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు**



బెంగళూరు: కర్ణాటకలో ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో 'ఫారం–7' దరఖాస్తులను దుర్వినియోగం చేసి 198 మంది ముస్లిం ఓటర్ల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించేందుకు ప్రయత్నించారన్న ఆరోపణలపై బీజేపీ నేత డాక్టర్ రవి పాటిల్‌తో పాటు 20 నుంచి 25 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బెళగావి నార్త్ అసెంబ్లీ నియోజకవర్గంలోని వార్డు నంబర్ 12లో బూత్ స్థాయి ఏజెంట్‌గా పనిచేస్తున్న మీరాసాబ్ సనది ఇచ్చిన ఫిర్యాదు మేరకు బెళగావి మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఫిర్యాదు ప్రకారం.. సెప్టెంబర్ 22న రవి పాటిల్, శంకర్ బీరప్ప నాయిక్, ప్రశాంత్ దీపక్ ముండినమణితో పాటు మరో 20 నుంచి 25 మంది కలిసి ముస్లిం వర్గానికి చెందిన ఓటర్లను లక్ష్యంగా చేసుకున్నట్లు ఆరోపించారు. ఓటర్ల జాబితాలో పేరును చేర్చడం లేదా తొలగించడంపై అభ్యంతరం వ్యక్తం చేసేందుకు ఉపయోగించే 'ఫారం–7' దరఖాస్తులను ఉపయోగించి 198 మంది ఓటర్ల పేర్లను తొలగించేందుకు ప్రయత్నించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇందుకోసం నకిలీ పత్రాలు, తప్పుడు సమాచారాన్ని ఉపయోగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ దరఖాస్తులను బూత్ స్థాయి అధికారికి సమర్పించేందుకు ప్రయత్నించడంతో పాటు, వాటిని స్వీకరించేలా ఒత్తిడి తెచ్చినట్లు ఫిర్యాదుదారు ఆరోపించారు. అంతేకాకుండా మరో వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడించి అతడిని ఎన్నికల నమోదు అధికారిగా నమ్మించే ప్రయత్నం చేసినట్లు పేర్కొన్నారు. అయితే తాను, తన కుటుంబ సభ్యుల పేర్లు కూడా అదే విధంగా తొలగించేందుకు సమర్పించిన దరఖాస్తుల్లో ఉన్నట్లు గుర్తించడంతో బూత్ స్థాయి ఏజెంట్ మీరాసాబ్ సనది ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముస్లిం ఓటర్ల పేర్లను తొలగించడం ద్వారా వారిలో ఆగ్రహం రేకెత్తించి, తద్వారా శాంతిభద్రత లకు విఘాతం కలిగించే పరిస్థితులు సృష్టించేందుకు ప్రయత్నించినట్లు ఫిర్యాదులో ఆరోపించారు. ఈ ఆరోపణలపై పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే 198 మంది ఓటర్ల పేర్లు వాస్తవంగా ఓటర్ల జాబితా నుంచి తొలగిపోయినట్లు కేసు నిర్ధారించదు; దరఖాస్తుల ఆధారంగా పేర్ల తొలగింపునకు ఎన్నికల సంఘం నిర్దేశించిన పరిశీలన, ధ్రువీకరణ ప్రక్రియ ఉంటుంది. ఇదే తరహాలో ముస్లిం ఓటర్ల పేర్లను 'ఫారం–7' ద్వారా తొలగించేందుకు ప్రయత్నించారన్న ఫిర్యాదు లపై బీదర్, మైసూరులోనూ కేసులు నమోదయ్యా యి. ఈ వ్యవహారాలపై ఆయా ప్రాంతాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.


'ఫారం–7' దరఖాస్తులపై డీకే ఆందోళన

ఓటర్ల జాబితా నుంచి అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించేందుకు 'ఫారం–7' దరఖాస్తులను పెద్ద సంఖ్యలో దాఖలు చేశారన్న ఆరోపణలపై కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం వద్ద సుమారు ఐదు గంటలపాటు ధర్నా నిర్వహించారు. 'ఫారం–7' దుర్వినియో గంపై నిష్పా క్షికంగా, కాలపరిమితితో కూడిన విచారణ చేపట్టాలని, తప్పుడు వాంగ్మూలాలు లేదా ప్రకటనలు ఇచ్చిన దరఖాస్తుదారులపై చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. ముందుగా నిర్ణయించిన మంత్రివర్గ సమావేశాన్ని వాయిదా వేసిన డీకే శివకుమార్.. మంత్రులు, అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి సీఈవో కార్యాలయానికి వెళ్లారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో క్లెయిమ్‌లు, అభ్యంతరాల గడువు ముగిసే సమయంలో, ముఖ్యంగా సెప్టెంబర్ 22 నుంచి 24 మధ్య పెద్ద సంఖ్యలో 'ఫారం–7' అభ్యంతరాలు దాఖలైనట్లు తనకు సమాచారం అందిందని ఆయన తెలిపారు. బెళగావి నార్త్‌లో సుమారు 3,000, ముడిగెరెలో 6,259, బాబలే శ్వర్‌లో 1,373, నరసింహరాజా లో 1,200, భాల్కి నియోజకవర్గాల్లో 2,285 దరఖాస్తులు దాఖలైనట్లు నివేదికలు వచ్చాయని పేర్కొన్నారు. ముఖ్యంగా మైనారిటీలు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఇతర వెనుకబడిన తరగతు లకు చెందిన అర్హులైన ఓటర్లను లక్ష్యంగా చేసుకుని వారి పేర్ల తొలగింపునకు బీజేపీ, జేడీ(ఎస్) కుట్ర పన్నాయని డీకే శివకుమార్ ఆరోపించారు. 'ఫారం–7' దుర్వినియోగం ఎన్నికల మోసానికి దారి తీసే వ్యవహా రమని పేర్కొన్న ఆయన, దీనిపై సమగ్ర విచారణ జరపాలని కోరుతూ రాష్ట్ర ప్రధా న ఎన్నికల అధికారి అన్బుకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రతి అర్హతగల ఓటరు హక్కులను పరిరక్షించడం, ఓటర్ల జాబితా పునర్విమర్శ ప్రక్రియ స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, చట్టబద్ధంగా జరిగేలా చూడటం ముఖ్యమం త్రిగా తన బాధ్యత అని లేఖలో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన సీఈవో అన్బుకు మార్.. తప్పుడు ప్రకటనలు లేదా వాంగ్మూలాలు ఇచ్చినట్లు తేలిన దరఖాస్తుదా రులపై చర్యలు ప్రారంభించాలని ఎన్నికల అధికారులను ఆదేశించారు.

చెరువులో మునిగి నలుగురు బాలికలు మృతి

- **స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునక**
- **మృతుల్లో ఇద్దరు అక్కాచెల్లెళ్లు**

పాట్నా: బిహార్‌లో విషాద ఘటన చోటు చేసుకుంది. చెరువులో స్నానానికి వెళ్లిన నలుగురు బాలికలు నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన తూర్పు చంపారన్ జిల్లా ఇనర్వభార్ పంచాయతీ పరిధిలోని బంకాట్ గ్రామంలో జరిగింది. పహర్‌పూర్ పోలీస్ స్టేషన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంకాట్ గ్రామానికి చెందిన ఐదుగురు బాలికలు ఉదయం 9.30 గంటల సమయంలో స్థానిక చెరువుకు స్నానం చేసేందుకు వెళ్లారు. వారిలో నలుగురు బాలికలు నీటిలోకి దిగగా, మరో బాలిక ఒడ్డునే ఉండిపో యింది. నీటిలోకి దిగిన బాలికలు చెరువు లోతును అంచనా వేయలేకపోవడంతో క్రమంగా లోతైన ప్రాంతంలోకి వెళ్లి మునిగిపోయారు. కళ్లముందే నలుగురు బాలికలు నీటిలో మునిగిపోవడంతో ఒడ్డున ఉన్న బాలిక వెంటనే సమీపంలోని వారికి సమాచారం అందించింది. విషయం తెలుసుకున్న గ్రామస్థులు, పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. కొద్దిసేపటి తర్వాత నలుగురు బాలికల మృతదేహాలను చెరువు నుంచి వెలికితీశారు. మృతుల్లో ఇద్దరు అక్కాచెల్లెళ్లు ఉన్నారు. మృతులం తా 13 ఏళ్లలోపు బాలికలే. మృతులను సోనావతి కుమారి (13), ఆమె చెల్లెలు పూల్వతి కుమారి (10), సోనాలి కుమారి (10), ప్రతిభా కుమారి (12)గా పోలీసులు గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక మోతిమరి సర్దార్ ఆస్పత్రికి తరలించారు. చిన్నారులు మృతి చెందడంతో వారి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవు తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాలికల మృతికి సంబంధించిన పూర్తి వివరాలు పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత వెల్లడవుతాయని పోలీసులు తెలిపా రు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరపున అవసర మైన సహాయం అందిస్తామని జిల్లా మెజిస్ట్రేట్ సౌరభ్ సుమన్ ప్రకటించారు.









సూపర్ సిక్స్

- ఆసియా క్రీడల్లో ఒకేరోజు భారత్‌కు ఆరు స్వర్ణాలు
- మహిళల హాకీలో 44ఏళ్ల తర్వాత స్వర్ణం
- బాక్సింగ్‌లో హ్యాట్రిక్.. ఆర్చరీ, రెజ్లింగ్‌లోనూ పసిడి పతకాలు
- ఆర్చరీలో పురుషుల రికర్వ్ జట్టు, మిక్స్‌డ్ జట్టుకు రజతాలు
- పెంచలిలో 36కు చేరిన పతకాల సంఖ్య

నాగోయా/కకమిగహరా/నిషియో: ఆసియా క్రీడల్లో భారత క్రీడాకారులు శుక్రవారం అదరగొట్టారు. హాకీలో మహిళల జట్టు 44ఏళ్ల తర్వాత స్వర్ణం సాధించగా, బాక్సింగ్‌లో లవ్లీనా బోర్గోహైన్, పర్వీన్ హూడా, అంకుశ్ పంఘాల్ పసిడి పతకాలు అందుకున్నారు. రెజ్లింగ్‌లో సుజీత్ కల్కల్, మహిళల రికర్వ్ ఆర్చరీ జట్టు సైతం స్వర్ణ పతకాలు గెలుచుకున్నాయి. ఆర్చరీలో పురుషుల రికర్వ్ జట్టు, మిక్స్‌డ్ జట్టు రజతాలు సాధించగా, సెయిలింగ్‌లో నెత్రా కుమనన్ కాంస్యం గెలుచుకుంది. దీంతో శుక్రవారం ఒకేరోజు భారత్ ఖాతాలో 9 పతకాలు చేరుకోగా.. ఇందులో 6 స్వర్ణాలు, 2 రజతాలు, 1 కాంస్యం ఉన్నాయి.

ట్రిపుల్ ధమాకా!

ఆసియా క్రీడల్లో భారత బాక్సర్లు అదరగొట్టారు. శుక్రవారం జరిగిన ఫైనల్స్‌లో లవ్లీనా బోర్గోహెయిన్ (75 కిలోలు), పర్వీన్ హూడా (65 కిలోలు), అంకుశ్ పంఘాల్ (80 కిలోలు) స్వర్ణ పతకాలు సాధించారు. దీంతో ఆసియా క్రీడల బాక్సింగ్‌లో భారత్ మహిళా బాక్సర్ల పతకాల సంఖ్య 36కు చేరింది. ఆసియా క్రీడల్లో ఇదే భారత్ అత్యుత్తమ ప్రదర్శన. 2010 గ్వాంగ్‌జౌలో భారత్ మొత్తం తొమ్మిది పతకాలు సాధించినా.. స్వర్ణాలు రెండే. తన 29వ పుట్టినరోజున లవ్లీనా చైనాకు చెందిన జీ బామోను 5–0తో ఓడించి స్వర్ణం అందుకుంది. గత ఆసియా క్రీడల్లో రజతంతో సరిపెట్టుకున్న ఆమె ఈసారి పసిడితో ఆ లోటును తీర్చుకుంది. పర్వీన్ హూడా చైనీస్ తైపీకి చెందిన పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత చెన్ నియెన్‌చిన్‌పై 3–2తో ఉత్కంఠభరిత విజయం సాధించి తొలిసారి ఆసియా క్రీడల స్వర్ణం గెలిచింది. 21ఏళ్ల అంకుష్ పంఘాల్ పురుషుల 80 కిలోల్లో స్వర్ణం సాధించి సత్తా చాటాడు. కిమ్‌పై తొలి రెండు రౌండ్లలో ఆధిపత్యం ప్రదర్శించిన అంకుష్.. చివరి రౌండ్‌లో ఫుట్‌వర్క్‌తో ప్రత్యర్థిని అలసిపోయేలా చేసి స్మార్ట్ నిర్ణయంతో విజయం సాధించాడు.

ఆర్చరీలో అదుర్స్

మహిళల రికర్వ్ టీమ్ ఫైనల్లో అంకిత భకత్, కుమ్‌కుమ్ మోహోద్, కీర్తి శర్మలతో కూడిన జట్టు దక్షిణ కొరియాను 5–3తో ఓడించి ఆసియా క్రీడల చరిత్రలో ఈ విభాగంలో భారత్‌కు తొలి స్వర్ణం అందించింది. పురుషుల రికర్వ్ టీమ్ ఫైనల్లో భారత్ దక్షిణ కొరియా చేతిలో 1–5తో ఓడి రజతంతో సరిపెట్టుకోగా, మిక్స్‌డ్ రికర్వ్‌లో ధీరజ్ బొమ్మదేవర, కుమ్‌కుమ్ మోహోద్ జోడీ సైతం చైనాపై ఓడి రజతం సాధించింది.

సుజీత్ అద్భుతం.. రెజ్లింగ్‌లో స్వర్ణం

భారత యువ రెజ్లర్ సుజీత్ కల్కల్ పురుషుల 65 కిలోల విభాగంలో ఆసియా క్రీడల స్వర్ణ పతకాన్ని సాధించాడు. ఫైనల్లో తజికిస్థాన్‌కు చెందిన అబ్దుల్‌మజీద్ కుడీవ్‌పై 2–9తో వెనుకబడ్డ సుజీత్.. అద్భుతంగా పుంజుకుని వరుసగా ఎనిమిది పాయింట్లు సాధించి 10–9తో విజయం సాధించాడు. తొలుత కుడీవ్ 9–2 ఆధిక్యంలోకి వెళ్లినా.. సుజీత్ ప్రత్యర్థి బలానికి తన వేగంతో సమాధానమిచ్చాడు. వరుస టేక్‌డౌన్లతో లోటును 8–9కు తగ్గించి, పోటీ ముగియడానికి 20 సెకన్ల ముందు కీలక టేక్‌డౌన్ సాధించాడు. అనంతరం ఆధిక్యాన్ని కాపాడుకుని ఆసియా క్రీడల్లో తొలిసారి స్వర్ణం సొంతం చేసుకున్నాడు. మహిళల 50 కిలోల్లో 18 ఏళ్ల డిపాన్షి ఫొగాట్ కాంస్య పతకానికి చేరువై ఓడిపోయింది. పురుషుల 125 కిలోల్లో రజత్ కజకిస్థాన్ రెజ్లర్ యెడిగే కాసింబెకిన్ చేతిలో 3–8తో, మహిళల 76 కిలోల్లో ప్రియా మాలిక్ కిర్గిజిస్థాన్ రెజ్లర్ ఐపెరి మెడెట్ కిజీ చేతిలో 1–6తో ఓడి నిష్క్రమించారు. ఇక సెయిలింగ్‌లో మహిళల డింగీ విభాగంలో నెత్రా కుమనన్ కాంస్య పతకం సాధించింది. ఇది ఈ ఆసియా క్రీడల్లో సెయిలింగ్‌లో భారత్‌కు మూడో పతకంగా నిలిచింది.

44ఏళ్ల నిరీక్షణకు తెర

ఆసియా క్రీడల మహిళల హాకీలో భారత్ 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించింది. శుక్రవారం జరిగిన ఫైనల్లో డిఫెండింగ్ చాంపి యన్, ఒలింపిక్స్ రజత పతక విజేత చైనాను 1–0తో ఓడించి స్వర్ణ పతకం సొంతం చేసుకుంది. ఈ విజయంతో 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌కు భారత్ నేరుగా అర్హత సాధించింది. 10వ నిమిషంలో సాక్షి రాణా అందించిన పాస్‌ను అందుకు న్న లాల్ రెమ్సియామి పరుగులోనే రివర్స్ స్టిక్‌తో కొట్టిన అద్భుత షాట్ నేరుగా గోల్‌పోస్ట్ పైభాగంలోకి దూసుకెళ్లింది. చైనా గోల్ కీపర్‌కు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా భారత్‌కు ఆధిక్యం అందించింది. తొలి క్వార్టర్‌లో భారత్ దూకుడుగా ఆడగా, చైనా స్వల్పంగా ఎక్కువ బంతి ఆధిపత్యం సాధించినా భారత రక్షణ పటిష్ఠంగా నిలిచింది. రెండో క్వార్టర్‌లో చైనా ఒత్తిడి పెంచింది. 24వ నిమిషంలో పెనాల్టీ స్ట్రోక్ లభించినా సవితా పునియా అద్భుతంగా అడ్డుకుని భారత్ ఆధిక్యాన్ని కాపాడింది. విరామం తర్వాత చైనా వరుసగా పెనాల్టీ కార్నర్లు సాధించడంతో భారత రక్షణకు పరీక్ష ఎదురైంది. నవ్‌నీత్ కౌర్ కీలక గోల్‌లైన్ క్లియరెన్స్‌తో సమం చేసే అవకాశాన్ని అడ్డుకుంది. మరోవైపు చైనా గోల్ కోసం అన్ని ప్రయత్నాలు చేసింది. మ్యాచ్ ముగియడానికి ఐదు నిమిషాల ముందు గోల్‌కీపర్‌ను కూడా వెనక్కి తీసి అదనపు ఆటగాడిని మైదానంలోకి పంపిం ది. అయినా భారత్ రక్షణ కదల్లేదు. ఇషికా చౌదరి, బల్జీత్ కౌర్, సుశీలా చాను తదితరులు చైనా దాడులను సమర్థంగా అడ్డుకున్నారు.





ముంబై విమానాశ్రయానికి రూ.2,000 కోట్ల బూస్ట్

- గంటకు 55 విమానాల రాకపోకల సామర్థ్యం పెంపే లక్ష్యం
- కొత్త ట్యాక్సీవేలు, ఆధునిక సాంకేతికతతో వేగం
- 2027 జనవరిలో టెర్మినల్–1 పునర్నిర్మాణం




ముంబై: ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో మౌలిక వసతులు, కార్యకలాపాల సామర్థ్యాన్ని పెంచేందుకు రాబోయే సంవత్సరాల్లో రూ.2,000 కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు విమానాశ్రయ నిర్వహణ సంస్థ మియాల్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం గంటకు 46 విమానాల రాకపోకల సామర్థ్యాన్ని 52–55కు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. 1,900 ఎకరాల్లో విస్తరించిన విమానాశ్రయంలో 09/27, 14/32 అనే రెండు పరస్పరం దాటే రన్‌వేలు ఉన్నాయి. దీంతో ఒకేసారి టేకాఫ్, ల్యాండింగ్ సాధ్యం కాదు. రెండు విమానాల రాకపోకల మధ్య ప్రస్తుతం 65 సెకన్ల వ్యవధి ఉంటుందని తెలిపారు.

ట్యాక్సీవేల విస్తరణ

రన్‌వే 14/32 వెంట తూర్పు సమాంతర ట్యాక్సీవే నిర్మించడంతో పాటు మిథి నదిపై వంతెనతో ట్యాక్సీవే 'ఎం'ను పొడిగించనున్నారు. పశ్చిమ సమాంతర ట్యాక్సీవేలు, అదనపు ట్యాక్సీ లింకులు, వేగవంతమైన ఎగ్జిట్ ట్యాక్సీవేలను అభివృద్ధి చేస్తారు. టెర్మినల్–1, టెర్మినల్–2, కార్గో, సాధారణ విమానయాన ప్రాంతాల్లో విమానాల పార్కింగ్ ప్రదేశాలను విస్తరిస్తారు. విమానాల కదలికలను పర్యవేక్షించే ఆధునిక వ్యవస్థలు, నిఘా సాంకేతికతలను కూడా మెరుగుపరుస్తారు.

2027లో టెర్మినల్–1 పనులు

ప్రస్తుత టెర్మినల్–1ను కూల్చివేసి 2027 జనవరిలో పునర్నిర్మాణ పనులు ప్రారంభించనున్నారు. కొత్త టెర్మినల్ 2029–30లో అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఇదిలా ఉండగా, అంతర్జాతీయ ప్రయాణికులు, కార్గో కార్యకలాపాల్లో కొంత భాగాన్ని నవీ ముంబై విమానాశ్రయానికి తాత్కాలికంగా తరలించడంపై అంతర్జాతీయ విమానయాన సంస్థల సమాఖ్య ఆందోళన వ్యక్తం చేసింది. అయితే కొత్త టెర్మినల్ అందుబాటులోకి వచ్చిన తర్వాత విమానయాన సంస్థల ప్రస్తుత స్లాట్ హక్కులను కొనసాగిస్తామని మియాల్ స్పష్టం చేసింది.



ఏపీలో రిలయన్స్ రూ.లక్ష కోట్ల పెట్టుబడి

సీబీజీ ప్లాంట్లతో 3 లక్షలకు పైగా ఉద్యోగాలు

- రాష్ట్రానికి రూ.60 వేల కోట్ల ఆదాయం
- రాయలసీమలో రూ.40 వేల కోట్లతో హార్టికల్చర్ హబ్

మదనపల్లె: ఆంధ్రప్రదేశ్‌లో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు రూ.లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ ఎం. అంబానీ తెలిపారు. వీటి ద్వారా 3 లక్షలకు పైగా ఉద్యోగాలు, రాబోయే దశాబ్దాల్లో రాష్ట్రానికి దాదాపు రూ.60 వేల కోట్ల ఆదాయం వస్తుందని చెప్పారు. మదనపల్లెలో రాయలసీమ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శుక్రవారం శంకుస్థాపన సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యవసాయ వ్యర్థాలు, పశువుల పేడ, ఆహార వ్యర్థాలతో తయారు చేసే సీబీజీ స్వచ్ఛమైన ఇంధనంగా ఉపయోగపడటంతోపాటు దిగుమతి ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గిస్తుందని అంబానీ అన్నారు. రైతులకు, గ్రామీణ ప్రాంతాలకు కొత్త ఉపాధి, ఆదాయ అవకాశాలు కల్పిస్తుందన్నారు. రాయలసీమలో స్వచ్ఛ ఇంధన ప్రాజెక్టులతోపాటు అధునాతన తయారీ రంగంలోనూ పెట్టుబడులు పెట్టనున్నట్లు తెలిపారు. జూన్ 2024 నుంచి ఏపీ ప్రభుత్వం 388 భారీ ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చిందని, వాటి పెట్టుబడి ప్రతిపాదనలు రూ.14 లక్షల కోట్లకు పైగా ఉన్నాయని అంబానీ చెప్పారు. వీటి ద్వారా దాదాపు 11 లక్షల ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇందులో సుమారు మూడో వంతు పెట్టుబడులు రాయలసీమకు వస్తున్నాయని తెలిపారు.



సాంకేతిక వ్యవసాయానికి ప్రాధాన్యం

రూ.40 వేల కోట్లతో ఏర్పాటు చేయనున్న రాయలసీమ హార్టికల్చర్ హబ్ ద్వారా సాంకేతిక ఆధారిత వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తామని అంబానీ తెలిపారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌లో కృత్రిమ మేధ, డ్రోన్లు, ఖచ్చితమైన నీటిపారుదల, రోబోటిక్స్, పంటల ధరల సమాచారాన్ని వినియోగిస్తామన్నారు. జియో సహకారంతో ప్రాంతీయ భాషల్లో వర్చువల్ తరగతుల ద్వారా లక్షలాది మంది రైతులకు శిక్షణ ఇస్తామని, గ్రామీణ యువతను డిజిటల్ వ్యవసాయ విస్తరణ కార్యకర్తలుగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు రిలయన్స్ పెట్టుబడులు, సాంకేతిక నైపుణ్యం, డిజిటల్ సామర్థ్యాలు, పరిశ్రమ భాగస్వామ్యాలను అందిస్తుందని తెలిపారు. జామ్‌నగర్‌లో బయో ఎనర్జీ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేశామని, వనతార ప్రతిపాదిత వన్యప్రాణులు, పశువైద్య శాస్త్రాల విశ్వవిద్యాలయంతోనూ సహకారాన్ని పరిశీలిస్తామని చెప్పారు. ''నన్ను ఆంధ్రుడి కొడుకుగా భావించండి'' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఉద్దేశించి అంబానీ అన్నారు.

యూపీఐ లావాదేవీల్లో జోరు

- ఆరు నెలల్లో 27% వృద్ధి.. 145 బిలియన్ లావాదేవీలు

విలువ పరంగా 20% పెరుగుదల.. రూ.177 లక్షల కోట్లకు చేరిక

న్యూఢిల్లీ: దేశంలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలు శరవేగంగా పెరుగుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026–27) తొలి ఆరు నెలల్లో యూపీఐ లావాదేవీల పరిమాణం 27 శాతం పెరిగి సుమారు 145 బిలియన్‌లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–సెప్టెంబర్ కాలంలో ఇవి 114 బిలియన్‌లుగా ఉన్నాయని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) గణాంకాలు వెల్లడించాయి. లావాదేవీల విలువ కూడా 20 శాతం పెరిగింది. గత ఏడాది తొలి ఆరు నెలల్లో నమోదైన రూ.148 లక్షల కోట్లతో పోలిస్తే.. ఈసారి రూ.177 లక్షల కోట్లకు చేరింది. సెప్టెంబరులో యూపీఐ లావాదేవీల సంఖ్య ఆగస్టుతో పోలిస్తే 1.7 శాతం తగ్గి 24.07 బిలియన్‌లుగా నమోదైంది. ఆగస్టులో 24.5 బిలియన్ లావాదేవీలు జరిగాయి. ఇదే సమయంలో లావాదేవీల విలువ 1.5 శాతం తగ్గి రూ.29.37 లక్షల కోట్లకు చేరింది. ఆగస్టులో ఇది రూ.29.82 లక్షల కోట్లుగా ఉంది. ఆగస్టులో 31 రోజులు ఉండగా.. సెప్టెంబరులో 30 రోజులే ఉండటమే ఈ స్వల్ప తగ్గుదలకు ప్రధాన కారణమని పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. రోజువారీ సగటు లావాదేవీలు మాత్రం ఆగస్టులో 791 మిలియన్ల నుంచి సెప్టెంబరులో 802 మిలియన్లకు పెరిగాయి.

15 నుంచి కొత్త ఎండీఆర్

రూ.2,000కు మించిన కొన్ని యూపీఐ లావాదేవీలపై అక్టోబర్ 15 నుంచి కొత్తగా 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) అమల్లోకి రానుంది. ఈ రుసుమును వినియోగదారులు కాకుండా వ్యాపారులే చెల్లించాల్సి ఉంటుంది. రూ.75,000 లేదా అంతకంటే ఎక్కువ లావాదేవీలకు ఈ ఛార్జీ గరిష్ఠంగా రూ.300కు పరిమితం కానుంది. వ్యక్తి నుంచి వ్యక్తికి జరిగే (పీ2పీ) యూపీఐ లావాదేవీలపై ఎంత మొత్తమైనా ఎలాంటి ఛార్జీ ఉండదు. నెలకు రూ.లక్ష వరకు యూపీఐ క్యూఆర్ ద్వారా వసూళ్లు చేసే చిన్న వ్యాపారులకు కూడా కొత్త ఎండీఆర్ నుంచి మినహాయింపు ఉంటుంది. దీనివల్ల దాదాపు 96 శాతం వ్యాపారి లావాదేవీలకు రక్షణ లభిస్తుందని పేర్కొన్నారు.

కీలక రంగాలకు ప్రత్యేక రుసుము

రైల్వేలు, టెలికాం, ఇంధనం, బీమా వంటి సేవలకు రూ.2,000కు మించిన లావాదేవీలపై ఒక్కో లావాదేవీకి రూ.5 చొప్పున రుసుము ఉంటుంది. మ్యూచువల్ ఫండ్లు, స్టాక్ బ్రోకింగ్ వంటి క్యాపిటల్ మార్కెట్ లావాదేవీలకు 0.02 శాతం రేటు వర్తిస్తుంది. దీనికీ గరిష్ఠంగా రూ.300 పరిమితి ఉంటుంది. అంతర్జాతీయంగానూ యూపీఐ విస్తరిస్తోంది. ప్రస్తుతం 11 దేశాల్లో యూపీఐని ఆమోదిస్తున్నారు. తాజాగా ఉజ్బెకిస్థాన్ ఈ జాబితాలో చేరింది. సింగపూర్, యూఏఈ, ఫ్రాన్స్, మారిషస్, నేపాల్, భూటాన్, ఖతార్, శ్రీలంక, కంబోడియా, గ్రీస్ తదితర దేశాల్లోనూ యూపీఐ అందుబాటులో ఉంది. 2016 ఆగస్టు 25న ప్రారంభమైన యూపీఐ.. దేశ డిజిటల్ చెల్లింపుల రంగాన్ని గణనీయంగా మార్చింది. 2016–17లో రూ.0.07 లక్షల కోట్లుగా ఉన్న యూపీఐ లావాదేవీల విలువ 2025–26 నాటికి సుమారు రూ.314 లక్షల కోట్లకు చేరింది.



120 నగరాలకు అమెజాన్ నౌ సేవలు

- రెండు వారాల్లోనే రెట్టింపైన సేవల విస్తరణ
- 300 నగరాలకు విస్తరించే లక్ష్యం

బెంగళూరు: పండుగల సీజన్ నేపథ్యంలో అమెజాన్ తన అత్యంత వేగవంత మైన డెలివరీ సేవ 'అమెజాన్ నౌ'ను దేశవ్యాప్తంగా 120కి పైగా నగరాలకు విస్తరించింది. రెండు వారాల్లోనే సేవల పరిధిని రెట్టింపు చేసినట్లు శుక్రవారం సంస్థ వెల్లడించింది. అమృత్‌సర్, అబోహర్, జలంధర్, అంబాలా, మంగళూరు, మణిపాల్, విశాఖప ట్నం, కొచ్చి, భువనేశ్వర్, కార్వార్ తదితర నగరాల్లోనూ సేవలు అందుబాటులోకి వచ్చాయి. కిరాణా సరుకులు, పండ్లు, కూరగాయలు, ఫ్రోజెన్ ఆహారం, వ్యక్తిగత సంరక్షణ, ఫ్యాషన్, బ్యూటీ ఉత్పత్తులు, చిన్న గృహోపకరణాలు, గృహావసర వస్తువు లు సహా వేలాది ఉత్పత్తులను నిమిషాల్లో అందించేందుకు దాదాపు 800 సూక్ష్మ, పట్టణ నెరవేర్పు కేంద్రాలను అమెజాన్ వినియోగిస్తోంది. గత మూడు నెలల విక్ర యాల ఆధారంగా అమెజాన్ నౌ వార్షిక స్థూల విక్రయాలు 100 కోట్ల డాలర్లకు చేరినట్లు సెప్టెంబర్‌లో ప్రకటించింది.



300 నగరాలకు విస్తరణ

అమెజాన్ నౌను 300కుపైగా నగరాలకు విస్తరించి, దేశంలోనే అతిపెద్ద 'నిమిషాల్లో డెలివరీ' నెట్‌వర్క్ నిర్మించాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. అమెజాన్ మొత్తం డెలివరీ నెట్‌వర్క్ ద్వారా లక్షలాది ఉత్పత్తులను అదే రోజు, మరుసటి రోజు కూడా అందిస్తోంది. అక్టోబర్ 8 నుంచి ప్రారంభమయ్యే గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్‌లో అమెజాన్ నౌ ద్వారా ప్రత్యేక ఆఫర్లు ఇవ్వనుంది. స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్, బ్యూటీ, గృహావసరాలపై డీల్స్ ఉంటాయి. ఎస్‌బీఐ క్రెడిట్, డెబిట్ కార్డులతో అర్హత కలిగిన కొనుగోళ్లపై 10 శాతం తక్షణ రాయితీ, ప్రైమ్ సభ్యులకు అదనంగా 10 శాతం వరకు పొదుపు లభిస్తుందని సంస్థ తెలిపింది. సేవ అందుబాటును అమెజాన్ యాప్‌లోని 'నౌ' గుర్తు ద్వారా తెలుసుకోవచ్చు.



స్టార్‌డమ్ కాదు.. పాత్రకే

'బ్లాస్ట్' సినిమాతో బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకుని టాలీవుడ్‌లో ఒక్కసారిగా క్రేజ్ తెచ్చుకున్న యువ కథానాయిక ప్రీతి ముకుందన్ ప్రస్తుతం వరుస అవకాశాలతో దూసుకుపోతోంది. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన కొద్దికాలంలోనే అనూహ్య స్థాయిలో పాపులారిటీ సొంతం చేసుకున్న ఈ భామ.. తెలుగు, తమిళ భాషల్లో వరుసగా క్రేజీ ప్రాజెక్టులు చేస్తూ బిజీగా మారింది. ప్రస్తుతం ఆమె చేతిలో 'ఏమో ఏమో ఇది', ధనుష్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'డీ–56' వంటి భారీ చిత్రాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ప్రీతి ముకుందన్ తన కెరీర్, లక్ష్యాల గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించింది. టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా ఎదగాలన్న కోరిక తనకు ఏమాత్రం లేదని ఆమె స్పష్టం చేసింది. కేవలం గ్లామర్ పాత్రల ద్వారా వచ్చే గుర్తింపు కంటే.. తాను పోషించే పాత్ర ప్రేక్షకులపై ఎంతటి ప్రభావం చూపుతుందనేదే తనకు ముఖ్యమని చెప్పుకొచ్చింది. పెద్ద హీరోయిన్ అనే ట్యాగ్ కోసం తాను ఎప్పుడూ ప్రయత్నించనని, ఒక్క సినిమాలో మాత్రమే నటించినా ఆ చిత్రంలోని తన పాత్ర ప్రేక్షకుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోవాలన్నదే తన లక్ష్యమని తెలిపింది. కథలో తన పాత్రకు తగిన ప్రాధాన్యం, బలమైన నేపథ్యం ఉండాలని.. కేవలం తన ఇమేజ్‌ను పెంచుకోవడం కోసం ఏ పాత్రనూ అంగీకరించబోనని తేల్చిచెప్పింది. ముఖ్యంగా గ్లామర్‌కు పరిమితమయ్యే పాత్రల కంటే తన నటనా ప్రతిభను ప్రదర్శించేందుకు అవకాశం ఉన్న పాత్రలకే ప్రాధాన్యం ఇస్తానని పేర్కొంది. స్టార్‌డమ్ కంటే మంచి నటిగా గుర్తింపు తెచ్చుకోవడమే తనకు ముఖ్యమన్న ప్రీతి ముకుందన్ ఆలోచనలు ప్రస్తుతం సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఆమె అభిప్రాయాలను పలువురు ప్రశంసిస్తుండగా.. సోషల్ మీడియాలోనూ ప్రీతి ముకుందన్ వ్యాఖ్యలపై సానుకూల స్పందనలు వ్యక్తమవుతున్నాయి.

హనుమాన్ అంశ్ సీక్వెల్‌పై కీలక అప్‌డేట్




నీమ్ కరోలీ బాబా జీవిత చరిత్ర ఆధారంగా విశాల్ చతుర్వేది తెరకెక్కించిన చిత్రం 'హనుమాన్ అంశ్'. ఈ ఏడాది ఆగస్టు 7న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా ఘన విజయాన్ని అందుకోవడంతో పాటు బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డు లు సృష్టించింది. అనంతరం తెలుగులోనూ అనువాదమై ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందింది. కేవలం రూ.1.5 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఏకంగా రూ.312 కోట్లకు పైగా వసూళ్లు సాధించి నట్లు చిత్ర బృందం వెల్లడించిం ది. ఈ నేపథ్యం లో సినిమాకు సీక్వెల్ ఉంటుందా అనే ఆసక్తి నెలకొనగా.. నిర్మాత అనుప్రియా నాగర్ తాజాగా దీనిపై కీలక అప్‌డేట్ ఇచ్చారు. సినిమా విజయానంతరం మీడియాతో మాట్లాడిన ఆమె.. మొదటి భాగం భారీ వసూళ్లు సాధించినంత మాత్రాన సీక్వెల్‌ను భారీ బడ్జెట్‌తో తెరకెక్కించాలనే ఆలోచన లేదని స్పష్టం చేశారు. కథ డిమాండ్ మేరకు భారీ స్థాయి అవసరమైతే తప్ప, రెండో భాగాన్ని కూడా మొదటి సినిమాకు కేటాయించిన బడ్జెట్ పరిధిలోనే రూపొందించాలని భావిస్తున్నట్లు తెలిపారు. రూ.10 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ ఖర్చు చేసినంత మాత్రాన సినిమా తప్పకుండా విజయం సాధిస్తుందని చెప్పలేమని పేర్కొన్నారు. అవసరం లేకపోయినా విజువల్ ఎఫెక్ట్స్, కృత్రిమ మేధ వంటి సాంకేతికతలను అతిగా ఉపయోగిస్తే సినిమా సహజత్వం దెబ్బతినే అవకాశం ఉందన్నారు. అందుకే తమకు డబ్బు కంటే కథ, కంటెంట్ ముఖ్యమని స్పష్టం చేశారు. బడ్జెట్‌ను పెంచడం కంటే కథలోని వాస్తవికతను కాపాడుకోవడానికే ప్రాధాన్యం ఇస్తామని, పాత్రలతో పాటు కథ జరిగే కాలానికి సంబంధించిన భౌగోళిక పరిస్థితులు, వాతావరణాన్ని కూడా సహజంగా చూపించడం ముఖ్యమని తెలిపారు. మొదటి భాగానికి ప్రేక్షకుల నుంచి లభించిన స్పందనను దృష్టిలో పెట్టుకుని అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ సీక్వెల్‌ను రూపొందిస్తామని అనుప్రియా నాగర్ చెప్పినట్లు తెలుస్తోంది. నిర్మాత చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఇదిలా ఉండగా 'హనుమాన్ అంశ్' దర్శకుడు విశాల్ చతుర్వేది ప్రస్తుతం మరో చిత్రానికి అంగీకరించడంతో సీక్వెల్ తెరకెక్కేందుకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని నిర్మాత వెల్లడించారు.

'ఇట్లు అర్జున' వాయిదా



క్రేజీ డైరెక్టర్ వెంకీ కుడుముల నిర్మాణంలో 'వాట్ నెక్ట్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్' బ్యానర్‌పై తెరకెక్కుతున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'ఇట్లు అర్జున'. యువ నటులు అనీష్, అనస్వర రాజన్ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి మహేష్ ఉప్పల దర్శకత్వం వహిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్నారు. స్వచ్ఛమైన ప్రేమ కథకు ఆసక్తికరమైన మలుపులు, రొమాన్స్, యాక్షన్, ఎమోషన్, వినోదాన్ని జోడించి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన సినిమా అప్‌డేట్స్ ప్రేక్షకులను ఆకట్టుకు న్నాయి. ఈ చిత్రాన్ని అక్టోబర్ 9న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు మేకర్స్ గతంలో ప్రకటించారు. అయితే తాజాగా సినిమా విడుదలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించి, కొత్త విడుదల తేదీని ఖరారు చేశారు. 'ఒక సరికొత్త ప్రేమకథ.. అందులో ఒక ఆసక్తికర మైన మలుపు.. రొమాన్స్, యాక్షన్, ఎమోషన్, వినోదంతో అర్జున వెండితెరపైకి రాబోతున్నాడు. అర్జునను కలవడానికి మీరు సిద్ధంగా ఉన్నారా?' అంటూ కొత్త విడుదల తేదీని ప్రకటించారు. అక్టోబర్ 30న 'ఇట్లు అర్జున'ను థియేటర్లలో విడుదల చేయనున్నట్లు తెలిపారు. అయితే విక్టరీ వెంకటేష్ నటించిన 'ఆదర్శ కుటుంబం' చిత్రం అదే సమయంలో విడుదల కానుండటంతోనే 'ఇట్లు అర్జున'ను వాయిదా వేసినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.



'తులాభారం'లో రవితేజ..

వరుస పరాజయాల తర్వాత మాస్ మహారాజా రవితేజ 'ఇరుముడి'తో బాక్సాఫీస్ వద్ద విజయాన్ని అందుకున్నారు. టాలెంటెడ్ దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కించిన ఈ విభిన్న కథా చిత్రంలో మాస్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే రవితేజ పూర్తిగా భిన్నమైన పాత్రలో కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఆగస్టు 21న థియేటర్లలో విడుదలైన 'ఇరుముడి' బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకోగా.. సెప్టెంబర్ 18 నుంచి ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతూ అక్కడ కూడా విశేష స్పందనను సొంతం చేసుకుంటోంది. ప్రస్తుతం ఈ సినిమా విజయాన్ని ఆస్వాదిస్తున్న రవితేజ తన తదుపరి చిత్రంపై దృష్టి సారించారు. ఈ క్రమంలో దర్శకుడు వివేక్ ఆత్రేయతో ఆయన చేతులు కలిపిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ టైటిల్‌ను ఖరారు చేసినట్లు, త్వరలోనే చిత్ర బృందం అధికారికంగా ప్రకటించనున్నట్లు సమాచారం. వివేక్ ఆత్రేయ మార్క్ కామెడీ, ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు రవితేజ మాస్ ఇమేజ్‌ను మేళవిస్తూ రూపొందనున్న ఈ చిత్రంలో హారర్ టచ్ కూడా ఉండబోతున్నట్లు టాలీవుడ్ వర్గాల సమాచారం. దీంతో రవితేజ, వివేక్ ఆత్రేయ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.



అనిల్ రావిపూడి చేతుల మీదుగా 'కుకూన్స్' పోస్టర్ విడుదల

జగన్ జోగిరాజ్, సాగర్ కిరణ్, వికాస్ చైతన్య, సంగన డుగ్గ, సురభి దీప్తి, దీప్తి పద్మనిమ్మనగోటి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కుకూన్స్'. న్యూ వేవ్ పిక్చర్స్, ఎం.ఆర్ట్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై సుఖేష్ పొట్ల, మమత రెడ్డి కాసం, మహేశ్ గౌరి నిర్మిస్తున్నారు. యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులను అలరించేలా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మహేశ్ గౌరి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా 'కుకూన్స్' చిత్ర పోస్టర్‌ను బ్లాక్‌బస్టర్ దర్శకుడు అనిల్ రావిపూడి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'కుకూన్స్' సినిమా పోస్టర్‌ను విడుదల చేయడం ఆనందంగా ఉందన్నారు. పోస్టర్ కొత్తగా, ఆకట్టుకునేలా ఉందని, దర్శకుడు మహేశ్ గౌరి సరికొత్త ఆలోచనలు ఇందులో కనిపిస్తున్నాయని తెలిపారు. టైటిల్ కూడా చాలా బాగుందని పేర్కొన్నారు. ఈ చిత్రంలో ప్రధాన పాత్రల్లో ఒకటైన వికాస్ గతంలో 'డ్రామా జూనియర్స్' కార్యక్రమానికి మెంటార్‌గా పనిచేశారని, ఇప్పుడు 'కుకూన్స్'తో నటు డిగా ప్రేక్షకుల ముందుకు రాబోతు న్నారని చెప్పారు. జగన్, సాగర్, వికాస్‌తో పాటు చిత్ర బృందం మొత్తానికి తన శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు అనిల్ రావిపూడి పేర్కొన్నారు.

మహిళలనే ఎందుకిలా చూస్తారు? కృతి శెట్టి ఆవేదన..

'ఉప్పెన' సినిమాతో టాలీవుడ్‌లోకి గ్రాండ్‌గా ఎంట్రీ ఇచ్చి ఓవర్‌నైట్ స్టార్‌గా మారిన క్యూట్ బ్యూటీ కృతి శెట్టికి ఆ తర్వాత ఆశించిన స్థాయిలో అదృష్టం కలిసి రాలేదు. తొలి సినిమానే భారీ విజయం సాధించడంతో ఆమెకు వరుసగా క్రేజీ అవకాశాలు క్యూ కట్టాయి. దీంతో తక్కువ సమయంలోనే టాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్న కృతి శెట్టి.. ఆ తర్వాత నటించిన చిత్రాలు వరుసగా బాక్సాఫీస్ వద్ద నిరాశపరచడంతో ఆమె కెరీర్ ఒక్కసారిగా గాడి తప్పింది. వరుస పరాజయాల కారణంగా కొంతమంది సోషల్ మీడియాలో ఆమెను 'ఐరన్ లెగ్' అంటూ ట్రోల్ కూడా చేశారు. అయితే ఇలాంటి విమర్శలు, పరాజయాలు ఎదురైనా కృతి శెట్టి మాత్రం ఏమాత్రం వెనక్కి తగ్గకుండా తన కెరీర్‌పై దృష్టి సారిస్తోంది. టాలీవుడ్‌లో అవకాశాలు కాస్త తగ్గిన నేపథ్యంలో ప్రస్తుతం కోలీవుడ్‌పై ఫోకస్ పెట్టిన ఈ భామ.. అక్కడ రవిమోహన్ సరసన 'జీనీ' చిత్రంలో కథానాయికగా నటిస్తూ బిజీగా ఉంది. ఈ క్రమంలో కృతి శెట్టి తాజాగా సామాజిక మాధ్యమాల వేదికగా చేసిన ఓ పోస్ట్ ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సమాజంలోనే కాకుండా వెండితెరపై కూడా పురుషులు తాము చేసే పనులను నిరూపించుకోవాల్సిన అవసరం పెద్దగా ఉండదని, వారు చేసే పనులను ప్రేక్షకులు, సమాజం త్వరగా అంగీకరించి ఇష్టపడతారని కృతి అభిప్రాయపడింది. అదే సమయంలో ఒక మహిళ ఎంత ప్రతిభావంతురాలైనా, ఎంత పరిపూర్ణంగా ఉన్నా ఆమెను మాత్రం ఎప్పుడూ ఏదో ఒక కోణంలో పరిశీలిస్తూ, అందులోని లోపాలను వెతికే ప్రయత్నం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేసింది. మహిళలు తమను తాము నిరూపించుకునేందుకు ప్రతిసారీ అదనంగా శ్రమించాల్సి వస్తోందన్న భావనను ఆమె తన పోస్టులో వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. కృతి శెట్టి చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. మహిళల పట్ల సమాజంలో కొనసాగుతున్న వివక్ష, పురుషులు–మహిళలను అంచనా వేసే విధానంలో ఉన్న తేడాలపై ఆమె చేసిన వ్యాఖ్యలకు నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. కొందరు ఆమె అభిప్రాయానికి మద్దతు తెలుపుతుండగా.. మరికొందరు సోషల్ మీడియా వేదికగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా కృతి శెట్టి తాజా పోస్ట్ మరోసారి ఆమె వ్యక్తిగత ఆలోచనా విధానాన్ని, మహిళలపై సమాజం చూపించే వైఖరిపై ఆమెకున్న అసంతృప్తిని బయటపెట్టడంతో ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.

ఆర్జీవీ పోలీస్ కంపెనీలో 'ఫాతిమా సనా షేక్' పవర్‌ఫుల్ పాత్ర

బాలీవుడ్‌లో వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రతిభావంతురాలు ఫాతిమా సనా షేక్. 'దంగల్' చిత్రంతో బాలనటిగా ప్రేక్షకులకు పరిచయమైన ఆమె.. ఆ తర్వాత కథానాయికగా రాణిస్తూ తనదైన నటనతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా కథకు ప్రాధాన్యమున్న విభిన్న పాత్రలను ఎంచుకుంటూ ముందుకు సాగుతున్న ఫాతిమా.. ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు తెలుస్తోంది. వివాదాస్పద దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ తెరకెక్కిస్తున్న ముంబై అండర్‌వర్ల్డ్ నేపథ్యంలో రూపొందుతున్న 'పోలీస్ కంపెనీ' చిత్రంలో ఫాతిమా సనా షేక్ ఓ శక్తివంతమైన పాత్రలో నటించనున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. ఈ పవర్‌ఫుల్ యాక్షన్ డ్రామాలో ఫాతిమా పాత్ర సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలిచేలా ఉంటుందని టాక్ వినిపిస్తోంది. విభిన్నమైన పాత్రల్లో తన నటనతో మెప్పించే ఫాతిమా.. ఈ సస్పెన్స్ థ్రిల్లర్‌లో ఎలాంటి ప్రభావవంతమైన నటనను ప్రదర్శించను న్నారనే ఆసక్తి నెలకొంది. 'ఇట్ ఈజ్ మోర్ డేంజరస్ దెన్ డీ కంపెనీ' అనే ఇంటెన్స్ ట్యాగ్‌లైన్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని రామ్‌గోపాల్ వర్మ క్రైమ్ యాక్షన్ డ్రామాగా రూపొందిస్తున్నారు. 1990ల చివరి దశ, 2000ల ప్రారంభం లో ముంబై నగరాన్ని వణికించిన గ్యాంగ్‌వార్స్, వాటిని అణచివేసేందుకు ఏర్పాటైన ప్రత్యేక పోలీసు ఎన్‌కౌంటర్ స్క్వాడ్ నేపథ్యంలో కథ సాగనున్నట్లు సమాచారం. ముఖ్యంగా రియల్ లైఫ్ పోలీసు అధికారి దయా నాయక్ సాహ సాల ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొం దిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో హీరో హర్షవర్ధన్ రాణే శక్తివంతమైన పోలీసు అధికారి పాత్రలో కనిపించనున్నారు. టి–సిరీస్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఫాతిమా సనా షేక్ పాత్ర ఎలా ఉండబోతోందనే అంశం ప్రస్తుతం బాలీవుడ్‌లో ఆసక్తిని పెంచుతోంది.



స్త్రీ–3 భయంతో పాటు నవ్వుల మోత



శ్రద్ధా కపూర్, రాజ్‌కుమార్ రావు ప్రధాన పాత్రల్లో నటించనున్న తాజా హారర్ కామెడీ చిత్రం 'స్త్రీ–3'. ఘన విజయం సాధించిన 'స్త్రీ' ఫ్రాంచైజీలో మూడో భాగంగా తెరకెక్కనున్న ఈ చిత్రంపై నిర్మాత దినేష్ విజన్ తాజాగా కీలక అప్‌డేట్ ఇచ్చారు. ముంబైలో జరిగిన 'ఎఫ్ఐసీసీఐ ఫ్రేమ్స్ 2026' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన 'స్త్రీ–3' గురించి మాట్లాడుతూ.. దర్శకుడు అమర్ కౌశిక్ ఇప్పటికే సినిమా స్క్రిప్ట్‌ను పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కథ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించనుందని, వచ్చే ఏడాది చివర్లో చిత్రీకరణ ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే 2028 క్రిస్మస్ కానుకగా సినిమాను థియేటర్లలోకి తీసుకురావాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. మాడాక్ హారర్ కామెడీ యూనివర్స్‌లో భాగంగా తెరకెక్కనున్న 'స్త్రీ–3'లో ఈసారి భయంతో పాటు నవ్వులు మరింత ఎక్కువగా ఉంటా యని పేర్కొన్నా రు. పంకజ్ త్రిపాఠి, అపారశక్తి ఖురానా, అభిషేక్ బెనర్జీ తమకు పరిచయమైన పాత్రల్లోనే మరోసారి ప్రేక్షకులను అలరించనున్నారు. అయితే ఈ సినిమా కథ ఎక్కడ మొదలై ఎక్కడ ముగుస్తుందో ముందుగానే ఊహించడం కష్టమని, ప్రేక్షకులకు మైండ్ బ్లోయింగ్ సర్‌ప్రైజ్‌గా ఈ చిత్రం నిలుస్తుందని దినేష్ విజన్ చేసిన వ్యాఖ్యలు సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి.

Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.